ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
శుక్రవారం 12 జూలై 2024



శేషాచలం అడవుల్లో పెద్దపులులు ఉన్నాయా?

వందేళ్లుగా ఈ కొండల్లో కనిపించని పెద్దపులి జాడ 2018లో కనిపించింది. ఆ తర్వాత ఎక్కడా వాటి ఆనవాళ్లు లేవు. దీంతో శేషాచలంలో పెద్దపులులు ఉన్నాయా, లేవా అనే విషయంలో అటవీశాఖకు కూడా స్పష్టత లేదు. తాజాగా పొరుగునే ఉన్న నెల్లూరు జిల్లా ఆత్మకూరు రేంజ్ పరిధిలో రెండు పెద్దపులులు ఉన్నట్టు నిర్ధారణ కావడంతో శేషాచలంలోకి పెద్దపులుల రాక ఇంకెంతో దూరంలో లేదని భావిస్తున్నారు. నిజానికి పెద్దపులి కోసం శేషాచలం చాలా కాలంగా ఎదురు చూస్తోంది.

ఎర్రదొంగలకు దడ

శేషాచలం అడవుల్లోకి పెద్దపులి అడుగుపెడితే ఎర్రచందనం స్మగ్లర్లకు దడ మొదలవుతుంది. ప్రస్తుతం ఈ అడవిలో చిరుతపులులు మాత్రమే ఉన్నాయి. ఇవి గుంపులుగా ఉన్న మనుషులను చూసినా.. తిరగబడ్డా భయంతో పారిపోతాయి. పెద్దపులి మనిషికి భయపడదు. దీన్ని ఎదుర్కోవడం ప్రాణాలకు తెగించడమే. ఎర్రచందనం కోసం రాత్రిళ్ల అడవుల్లో యథేచ్ఛగా తిరగడం సాధ్యం కాదు. అయితే ఎర్ర స్మగ్లర్ల వల్ల పెద్దపులికి కూడా ముప్పు ఉంటుంది. చిరుతల్లా బెదరగొట్టి తరిమేయలేరు గనుక వీటిని విషాహారం పెట్టిగానీ, తుపాకులతో కాల్చేయడం గానీ చేసే ప్రమాదం ఉంది.

జీవవైవిధ్యం

పెద్దపులి వల్ల శేషాచలంలో జీవవైవిధ్యం సమతూకంలో ఉండే ప్రయోజనం ఉంది. అడవి పందులు, జింకలు, కణితలు, దుప్పులు వంటివి ఈ అడవుల్లో ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయాయి. ఇవి పెద్ద వృక్షాల జోలికి వెళ్లవుగానీ చిన్న మొక్కల్ని తినేస్తుంటాయి. ఒకవైపు ఎర్రచందనం స్మగ్లర్లు అడవిని నరికేస్తూ ఉంటే, కొత్త చెట్లు పెద్దవి కాకముందే శాఖాహార జంతువులకు ఆహారంగా మారిపోతున్నాయి. చిరుతలకు అవసరమైన ఆహారానికి మించిన సంఖ్యలో ఇవి పెరిగిపోయాయి. పెద్దపులి మాత్రమే వీటి సంఖ్యను కట్టడి చేయగలుగుతుంది. ఒకసారి వేటాడితే 50 కిలోల మాంసం ఆహారంగా తీసుకుంటుంది. పైగా వెయ్యి కిలోమీటర్ల పరిధిలో ఇది వేటసాగిస్తుంది.

- శేషాచలం సమీపంలో సంచరిస్తున్న పెద్దపులి
- లంకమలలో 9, వెలుగొండ అడవుల్లో 2 పులులు
- త్వరలోనే అడుగుపెడుతుందని అంచనా

కథనం
తిరుపతి
(మంగళం)

పులిరాజుకు స్వాగతం!

బ్రిటీష్ పాలనా కాలంలో మామండూరు అటవీప్రాంతంలో కిన్నెల్ అండ్రోసన్ అనే దొర పెద్దపులిని వేటాడి చంపినట్లు మామండూరు అటవీకార్యాలయ రికార్డుల్లో నమోదై ఉంది. ఆ తర్వాత ఇప్పటిదాకా వీటి జాడ లేదు. నల్లమలలో మాత్రం పెద్దపులుల సంఖ్య పెరుగుతూ ఉంది. నాగార్జునసాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వ్‌లో ప్రస్తుతం దాదాపు 80 వరకు పెద్దపులులు ఉన్నాయి. వీటి సంఖ్య నల్లమలలో పెరిగేకొద్దీ ఇతర ప్రాంతాలకు విస్తరిస్తాయి. ఈ విస్తరణ వందల కిలోమీటర్లు ఉంటుంది. పెద్దపులులు సమూహాలుగా జీవించవు. ఒంటరిగానే ఉంటాయి. వీటి ఆవాసాలు దూరదూరంగా ఉంటాయి.ఒక పులి ఆవాసానికి కనీసం 50 కిలోమీటర్ల ఆవల మాత్రమే మరొక పులి ఆవాసం ఉంటుంది. ఒక్కోసారి వీటి నివాస పరిధి వెయ్యి కిలోమీటర్ల దాకా కూడా ఉంటుంది. అందుకే నల్లమలలో సంతతి పెరిగేకొద్దీ వీటి ఆవాస పరిధి కూడా విస్తరించక తప్పదు.

ఇదీ.. పెద్దపులికి రాదారి!

దీనిని గుర్తించిన అటవీశాఖ నల్లమల నుంచి శేషాచలం దాకా పెద్ద పులుల కారిడార్ అని ప్రకటించింది. నాగార్జునసాగర్, శ్రీశైలం టైగర్ రిజర్వ్ ఫారెస్టు నుంచి శేషాచలం రిజర్వ్‌ఫారెస్టులోకి లంకమల మీదుగా చేరుకోవచ్చు. మొత్తం అటవీ ప్రాంతమే. ఇప్పటికే వీటి ప్రయాణం మొదలైంది. పెద్దపులులు నాగార్జునసాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వ్ (ఎస్ఎస్‌టీఆర్) నుంచి గుండ్ల బ్రహ్మేశ్వరం టైగర్ రిజర్వ్ (జీబీఎం) ఫారెస్ట్ మీదుగా లంకమల శాంక్చురీలోకి చేరుకుంటున్నాయి. ఈ విధంగా ఇప్పటికే లంకమలలోకి తొమ్మిది పులులు ప్రవేశించాయి. వీటి ఉనికిని అధికారులు గుర్తించారు. ఇక లంకమలకు అనుకుని రెండు కారిడార్లు వెళతాయి. ఒకటి కడప జిల్లా శేషాచలం అడవులు అయితే మరొకటి నెల్లూరు జిల్లా పెనుశిల నరసింహస్వామి శాంక్చురీ (పీఎన్ఎస్). కొద్ది రోజుల కిందట నెల్లూరు జిల్లా అటవీ ప్రాంతంలో కనిపించిన పెద్దపులులు ఈ కారిడార్ మీదుగా వచ్చినవేనని అటవీశాఖ అధికారులు నిర్ధారించారు. మర్రిపాడు ప్రాంతంలో ఒక మగపులి ఆనవాలు ఇటీవల కనిపించింది. ఉదయగిరి, రాపూరు, ఆత్మకూరు ప్రాంతాల్లో రెండేళ్లుగా ఒక ఆడపులి తిరుగుతోంది.



నల్లమల అటవీప్రాంతం నుంచి శేషాచల అటవీప్రాంతం వరకు టైగర్ కారిడార్ మ్యాప్

అనువైన అడవి శేషాచలం

ఇక మిగిలింది శేషాచలం మాత్రమే. లంకమలకు అనుకుని ఉన్న కడప జిల్లా పరిధిలోని శేషాచలం అడవుల్లోకి పెద్దపులి రాకపోకలకు పెద్దగా అవరోధం ఏమీ లేదు. 2018లో శేషాచలం పరిధిలోకి అడుగుపెట్టిన పెద్దపులి బహుశా ఆ తర్వాత మళ్లీ వెనుదిరిగి ఉండాలి. అయినా వాటి రాజమార్గం వాటికి ఉంది కాబట్టి అతి త్వరలోనే శేషాచలం అడవుల్లో పెద్దపులి అడుగుపెడుతుందని అటవీశాఖ అంచనా వేస్తోంది. శేషాచల కారిడార్‌లోకి పెద్దపులులు ప్రవేశిస్తే వాటి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. వాటికి అవసరమైన ఆహారం, ఆవాసం ఇక్కడ పుష్కలంగా ఉన్నాయని అటవీశాఖ అధికారులు తెలిపారు.పెద్దపులులు మరీ దట్టమైన అడవిలో ఉండవు. ఇక్కడ అడవులు చెట్లతో చదునుగా, చిన్న చిన్న ఎత్తుపల్లాలతో ఉంటాయి. రాతి గుహలుంటాయి. పులులకు అవసరమైన ఆహారం.. జింకలు, దుప్పులు, కొండగొర్రెలు, అడవిపందులు భారీ సంఖ్యలో శేషాచలంలో ఉన్నాయి. వీటితో పాటు నీటి వనరులు కూడా ఎక్కువే. ఒకసారి ఆవాసం ఏర్పాటు చేసుకుంటే చాలు సంతతి పెంచుకుంటూ ఆవాసాలను విస్తరించుకుంటాయి.

భక్తుల భద్రతకు ఓవర్‌పాస్

పెద్దపులి వల్ల తిరుమల కొండకు వచ్చే భక్తులకు ముప్పులేకుండా తగిన భద్రతా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.అలిపిరి నడక దారిలో ఏడో మైలు ప్రాంతంలో దట్టమైన అడవి ఉంటుంది. చిరుతల బెడద లేకుండా ఏడవ మైలు నుంచి లక్ష్మీనరసింహస్వామి టెంపుల్ వరకు ఓవర్‌పాస్ ఏర్పాటు చేయాలని వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా నిపుణుల బృందం ఇప్పటికే టీటీడీకి సూచించింది. ఈ ఏర్పాటు చేస్తే పెద్ద పులి వల్లే కాదు, చిరుతలు, ఎలుగుబంట్ల ముప్పు కూడా భక్తులకు దాదాపుగా ఉండదు.

శేషాచలంలో వెతుకుతున్నాం

లంకమల అభయారణ్యం సమీపంలో.. శేషాచల అటవీప్రాంతంలో 2018లో కనిపించిన పెద్దపుల్లి ఆనవాళ్లు ఆ తర్వాత ఇప్పటిదాకా లేవు గానీ ఈ దిశగా శేషాచల అడవుల్లో తగిన అధ్యయనం జరగలేదు.ఇప్పుడిప్పుడే ఈదిశగా అడుగులు పడుతున్నాయి.ఈ పరిశీలన తర్వాతే శేషాచలంలో పెద్దపులి ఉందా, లేదా అనే నిర్ధారణ జరుగుతుంది.

- రమేష్, బయాలజిస్టు, నాగార్జునసాగర్, శ్రీశైలం టైగర్ రిజర్వ్

రేషన్ బియ్యం బొక్కేస్తున్నారు!

- ప్రభుత్వం మారినా ఆగని అక్రమ రవాణా
- మరోమారు భారీగా బియ్యం పట్టివేత



నెలబల్లి వద్ద పట్టుబడిన బియ్యం లారీతో అధికారులు

సూళ్లూరుపేట, జూలై 11: సూళ్లూరుపేట కేంద్రంగా రేషన్ బియ్యం అక్రమ రవాణా కొనసాగుతూనే వుంది. ఐదేళ్ల వైసీపీ పాలనలో అడ్డూఅదుపు లేకుండా చలాయించిన రేషన్ మాఫియాకు ఇప్పుడు కూడా దందాను కొనసాగిస్తోంది. సూళ్లూరుపేట రాష్ట్ర సరిహద్దు ప్రాంతం కావడంతో మన రేషన్ బియ్యంతో పాటు తమిళనాడు రేషన్ బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలించి లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకొంటున్నారు.పేదలకు పంపిణీ చేసే బియ్యాన్ని కొందరు కార్డుదారులు అక్రమార్కులకు విక్రయిస్తున్నారు. ఇలా కొనుగోలు చేసిన బియ్యాన్ని గోదాముకు తరలించి అక్కడినుంచి రాత్రి సమయాల్లో లారీల ద్వారా బియ్యం బయటి ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు.ఇందుకు సహకరిస్తున్న స్థానిక అధికారులకే కాకుండా విజిలెన్స్, పౌరసరఫరాల జిల్లాస్థాయి అధికారులకు కూడా మాముళ్లు ముడుతున్నట్లు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.బియ్యం తరలిస్తున్న ఓ లారీని బుధవారం అర్ధరాత్రి జోరువానలో సూళ్లూరుపేట తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ వెంబడించారు. దొరవారిసత్రం మండలం నెలబల్లి వద్ద పట్టుబడిన లారీని పోలీసులకు అప్పగించారు. అందులో 535 బస్తాల తమిళ బియ్యంతో పాటు మన రాష్ట్రానికి చెందిన 75 బస్తాల రేషన్ బియ్యం ఉన్నాయి. అదే విధంగా గూడూరులో 300 బస్తాల రేషన్ బియ్యాన్ని పట్టుకొన్నారు. అది కూడా సూళ్లూరుపేట ప్రాంతం నుంచి అక్రమంగా తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.వైసీపీ ప్రభుత్వ హయాంలో అక్రమ దందా చేస్తున్న వారే ప్రస్తుతం కూడా రేషన్ అక్రమ రవాణా చేస్తున్నారని తేలింది.భారీ మొత్తంలో రేషన్ బియ్యాన్ని పట్టుకొన్నారని తెలియగానే పౌరసరఫరాల శాఖ, విజిలెన్స్ అధికారులతో పాటు పోలీసులు ఉలిక్కిపడ్డారు.పట్టుబడిన లారీని తప్పించేందుకు నానా ప్రయత్నాలు చేసినట్లు ప్రచారం జరిగింది. తహశీల్దార్ వెంటనే పోలీస్ స్టేషన్‌లో జీడీఆర్, బీట్ బుక్‌లో నమోదు చేసి లారీ డ్రైవర్ వద్ద వాంగ్మూలం తీసుకొని ఆర్డీవో చంద్రమునికి సమాచారం అందించారు. గురువారం ఉదయం కూడా కొందరు అధికారులు బియ్యాన్ని తక్కువ చేసి చూపించాలని ప్రయత్నాలు చేశారు.బియ్యం బస్తాలను నిల్వచేసుకొనేందుకు స్థలం లేదు.. ఎక్కడ దించుకోవాలంటూ కుంటి సాకులు చెబుతూ మధ్యాహ్నం వరకు కాలం వెళ్లబుచ్చారు. దీంతో జేసీ ధ్యానచంద్రకు తహశీల్దార్ సమాచారం ఇచ్చారు. దీంతో జేసీ పౌరసరఫరాల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. జేసీ ఆదేశాల మేరకు తడ మండలం కొండూరు వద్దనున్న పౌరసరఫరాల గోదాములో పట్టుబడిన బియ్యాన్ని కూలీలను పెట్టి దించి భద్రపరిచారు. లారీ డ్రైవర్ చంద్ర వాంగ్మూలం మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేశారు. పట్టుబడిన బియ్యం విలువ రూ.8 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు.

15.5 టన్నుల రేషన్‌బియ్యం పట్టివేత



గూడూరు, జూలై 11: స్థానిక ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోని జాతీయరహదారిపై గురువారం 15.5 టన్నుల రేషన్‌బియ్యాన్ని తరలిస్తున్న లారీని రూరల్ పోలీసులు పట్టుకున్నారు.తడ నుంచి నెల్లూరు వైపు వెళుతున్న లారీని స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపారు.

పట్టుబడిన లారీ వద్ద పోలీసులు, రెవెన్యూ సిబ్బంది

కారు ఢీకొని ముగ్గురు యువ కూలీల దుర్మరణం



రోడ్డుపై చెల్లాచెదురుగా సుఖ్‌దేవ్‌సింగ్, రాజాసింగ్,బపున్‌సింగ్ మృతదేహాలు

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 11: పొట్టకూటికి పొరుగు రాష్ట్రం నుంచి వచ్చిన ముగ్గురు యువకులు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. పోలీసుల కథనం మేరకు ..ఒడిశాకు చెందిన బపున్‌సింగ్ (21) రాజాసింగ్(22) సుఖ్‌దేవ్‌సింగ్(22) బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని ఆలత్తూరు శ్రీనిధి రాజా పరిశ్రమలో రెండేళ్లుగా కూలీలుగా పనిచేస్తున్నారు. కంపెనీ సమీపంలోనే కలసి ఉంటున్నారు. గురువారం వంట సరుకులు కొనుగోలు చేయడానికి కంపెనీ మేనేజర్ ద్విచక్ర వాహనంపై శ్రీకాళహస్తికి వెళ్లి తిరిగి వస్తుండగా బుచ్చినాయుడుకండ్రిగ నుంచి అతి వేగంగా వస్తున్న కారు ఢీకొంది. దీంతో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడి అక్కడిక్కడే మృతి చెందారు. పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా అస్పత్రికి తరలించారు. పరారైన కారు డ్రైవరు కోసం గాలిస్తున్నట్లు ఎస్ఐ వెంకటనరసింహ తెలిపారు.

తిరుపతిలో డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం

తిరుపతి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): డైరెక్టరేట్ ఆఫ్ ఎలక్ట్రికల్ సేఫ్టీ అండ్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ పరిధిలో తిరుపతి కేంద్రంగా డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం ఏర్పాటు కానుంది. ఇక్కడ ఈ కార్యాలయం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. తిరుపతి కార్యాలయం పరిధిలోకి తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, నెల్లూరు జిల్లాలు రానున్నాయి. అలాగే దీని పరిధిలో కడప, నెల్లూరు, తిరుపతి సబ్ డివిజన్లు వుంటాయి. ఇప్పటికే సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ కేంద్రంగా విద్యుత్ శాఖకు సంబంధించి తిరుపతి కీలక కేంద్రంగా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. తాజాగా నేరుగా ప్రభుత్వ నియంత్రణలో పనిచేసే ఎలక్ట్రికల్ సేఫ్టీ విభాగానికి సంబంధించి కూడా తిరుపతి ముఖ్య పాలనా కేంద్రంగా మారనుంది. తిరుపతిలో కార్యాలయం ఏర్పాటుకు అనుమతినిస్తూ, అలాగే డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ పోస్టు మంజూరు చేస్తూ ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

టీడీపీ శ్రేణులపై నమోదైన కేసులెన్ని?

ఎన్నికలకు ముందు, తర్వాత లెక్కలు తీస్తున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), జూలై 11: సార్వత్రిక ఎన్నికలకు ముందు , ఆ తర్వాత తెలుగుదేశం శ్రేణులపై ఎన్ని కేసులు నమోదయ్యాయి? ఎంతమందిని బైండోవర్ చేశారు..అనవసరంగా కేసుల్లో ఇరుక్కున్న వారెంతమంది వున్నారనే వివరాలను సర్కిళ్ల వారీగా పోలీసులు సేకరిస్తున్నారు.ఈ మొత్తం వివరాలు రెండు రోజుల్లో పంపాలని ఎస్పీకి ఉన్నతాధికారులనుంచీ ఆదేశాలందాయి.వైసీపీ నేతల ఆదేశాల మేరకు ఎన్నికలకు ముందు ప్రతిపక్షంలో వున్న తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలపై విచక్షణారహితంగా పోలీసులు కేసులు నమోదు చేశారని ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే.ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఎన్నికల ఫలితాలు వచ్చేంతవరకు దాదాపు 250 కేసులు నమోదైనట్లు సమాచారం. ఇందులో 107 సీఆర్పీసీ కింద 200 కేసులు, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌ను ఉల్లంఘించిన కేసులు మరో 50 వున్నాయి. పోలింగు అనంతరం మహిళా వర్శిటీ వద్ద నానీపై జరిగిన దాడి,తరువాత చోటుచేసుకున్న ఘర్షణలు, విధ్వంసాలు, అంతకు ముందు రోజు పాకాల, కూచువారిపల్లి, రామిరెడ్డిపల్లి, బ్రాహ్మణకాలువ, పులివర్తివారిపల్లెల్లో జరిగిన ఘటనల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలపై నమోదైన కేసులు, వాటి సెక్షన్లు, ఎఫ్ఐఆర్ కాపీలను స్కాన్ చేసి పంపేందుకు సిద్ధం చేస్తున్నారు.వీటిలో తప్పుడు కేసుల గురించి కూడా వివరించనున్నారు. మొత్తం 8 కాలాలతో వున్న ఫార్మాట్లో ఈ వివరాలను పంపడానికి పోలీసు అధికారులు కసరత్తు చేస్తున్నారు.



కౌంటర్‌ను ప్రారంభిస్తున్న జేసీ ధ్యానచంద్ర

రైతుబజారులో కందిపప్పు, బియ్యం విక్రయాలు ప్రారంభం

తిరుపతి(ఆటోనగర్), జూలై 11: రైతు బజారులో కిలో కందిపప్పును రూ.160కి అందుబాటులో ఉంచినట్లు జేసీ ధ్యానచంద్ర తెలిపారు. ఆర్సీ రోడ్డులోని రైతు బజారులో కందిపప్పు, బియ్యం విక్రయాలను గురువారం ఆయన ప్రారంభించారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో మొత్తం 16 కౌంటర్లు ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ కౌంటర్ల ద్వారా 593 మందికి స్టీమ్‌రైస్ కిలో రూ.49కి, పచ్చిబియ్యం కిలో రూ.48కి, కందిపప్పు కిలో రూ.160 చొప్పున 1,516 కిలోల బియ్యం, 1,002 కిలోల కందిపప్పును విక్రయించినట్లు వివరించారు. పౌరసరఫరాలశాఖ అధికారులు, రైతుబజారు ఎస్టేట్ అధికారి అయ్యప్పన్ పాల్గొన్నారు.

4 నుంచి 11వ తేదీవరకు తిరుమల ఎక్స్‌ప్రెస్ రద్దు

తిరుపతి(సెంట్రల్), జూలై 11: కడప-తిరుపతి-విశాఖపట్టణం మధ్య నడుస్తున్న తిరుమల ఎక్స్‌ప్రెస్ (17487-17488)ను ఆగస్టు నాలుగు నుంచి 11వ తేదీవరకు రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. విజయవాడ-విశాఖపట్టణం మధ్య ఆటోమేటిక్ సిగ్నల్ పనులు జరుగుతున్న కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గుర్తించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.


భూమిపూజ చేస్తున్నప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు

ఎమ్మెల్యే నాని చొరవతో తాగునీటి పైపులైన్ నిర్మాణానికి భూమిపూజ

పాకాల, జూలై 11: పాకాల పంచాయతీ సచివాలయం -2 పరిధిలోని ప్రాంతాలకు తాగునీటి సరఫరా కోసం ఎమ్మెల్యే పులివర్తి నాని చొరవతో పైపులైను నిర్మాణానికి గురువారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. గాంధీనగర్, గుట్ట కింద ఇండ్లు, బాలాజీ కాలనీ, శివాజీనగర్, వల్లివార్ వీధి, కరీంతుల్లాబాద్, శ్రీనివాసనగర్ ప్రాంతాల ప్రజలు తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఆ ప్రాంతాల్లో నీటి లభ్యత లేకపోవడంతో పాకాల పొగతోటలో బోరువేసి సుమారు రెండు కిలోమీటర్ల మేర పైపులైను నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. నిర్మాణ పనులు పూర్తయితే ఆ ప్రాంతాలకు నీటి సమస్య తీరనుందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే నానీకి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

దుర్యోధన వధతో ముగిసిన మహాభారత యజ్ఞం


దుర్యోధన వధను ప్రదర్శిస్తున్న కళాకారులు

పాకాల, జూలై 11: మండలంలోని దామలచెరువు పంచాయతీ పోలిశెట్టి గారిపల్లె భారతంమిట్టలో గత నెల23వ తేదీన ప్రారంభమైన మహాభారత ఉత్సవాలు గురువారం దుర్యోధన వధతో పరిసమాప్తమయ్యాయి. భాగవతారిణి ఎన్.ఉషారాణి హరికథ ఆకట్టుకుంది. చివరిరోజు శ్రీవెంకటేశ్వర నాటక కళామండలి ఆధ్వర్యంలో నిర్వహించిన దుర్యోధన వధ ప్రదర్శనలో భీముడుగా బాలాజీ, దుర్యోధనుడుగా దేవ, ద్రౌపదిగా సాయి నటించారు. పరిసర గ్రామాల ప్రజలు విశేష సంఖ్యలో తరలివచ్చారు.

తాత్కాలిక అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలి


నారా లోకేశ్‌ను కలిసిన తెలుగునాడు జూనియర్ లెక్చరర్ల సంఘం నాయకులు

పాకాల, జూలై 11: తాత్కాలిక అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని తెలుగునాడు జూనియర్ లెక్చరర్ల సంఘం నాయకులు కోరారు. బుధవారం రాత్రి మంత్రి నారా లోకేశ్‌ను మంగళగిరిలో కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేసినట్లు వారు తెలిపారు. జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు చేయాలని, కాంట్రాక్ట్ అధ్యాపకులు, ల్యాబ్ అటెండర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పదవీ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని కోరారు. సంఘం నాయకులు మల్లయ్య నాయుడు, నాగరాజ నాయుడు, శరత్ చంద్రశేఖర్, మునిరత్నం, సుబ్రమణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

13న తలనీలాలకు వేలం పాట

పాకాల, జూలై 11: మండలంలోని ఊట్లవారిపల్లె సమీపంలోని ఆనందగిరి (పాళ్యంకొండ)పై వెలసిన సుబ్రహ్మణ్య స్వామి ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలలో భక్తులు సమర్పించే తలనీలాలు పోగుచేసుకోవడానికి బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణ అధికారి యువరాణి తెలిపారు. 13వ తేది శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు ఆలయ ఆవరణలో వేలంపాట జరుగుతుందన్నారు. తలనీలాలు, పాదరక్షలు, వాహనాల పార్కింగ్, కొబ్బరి చిప్పలు పోగుచేసుకునే హక్కులకు నిర్వహించే వేలంపాటలో తగిన ధరావత్తు చెల్లించి పాల్గొనాలని ఆమె కోరారు.

శాస్త్రోక్తంగా శ్వేత వారాహిదేవికి తిరుమంజనం


పూజలు నిర్వహిస్తున్న రమ్యానందభారతి

రామచంద్రాపురం, జూలై 11: రాయలచెరువు కట్ట శ్రీశక్తి పీఠంలో వెలసిన భూగర్భ శ్వేత వారాహిదేవికి గురువారం శాస్త్రోక్తంగా తిరుమంజనం నిర్వహించారు. వారాహి నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య వారాహి హోమాన్ని ప్రారంభించగా, కుర్తాలం పీఠాధిపతి సిద్ధేశ్వరానందభారతి, శక్తి పీఠాధీశ్వరి రమ్యానందభారతి పూర్ణాహుతితో ముగించారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం అమ్మవారి ఊంజల్‌సేవ నేత్రపర్వంగా సాగింది. రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. రెండు తెలుగు రాష్ట్రాలనుంచి భారీ ఎత్తున భక్తులు తరలి వచ్చారు.

ట్రిపుల్ ఐటీకి ఇద్దరు విద్యార్థినుల ఎంపిక

రామచంద్రాపురం, జూలై 11: నెత్తకుప్పం ఉన్నతపాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు హెచ్‌ఎం తులసీకుమారి తెలిపారు. మండలంలోని పార్వతీపురం గ్రామానికి చెందిన కుసుమ, పిళ్లారికోనకు చెందిన ఇందు 10వ తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించినట్లు హెచ్‌ఎం తెలిపారు. పీఈటీ సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయ బృందం ఈ విద్యార్థినులను అభినందించారు.

సీఎంపై వ్యాఖ్యలు చేసిన వైసీపీ నేతలను అరెస్ట్ చేయాలి


ఎస్‌ఐ రవీంద్రనాయక్‌కు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

చంద్రగిరి, జూలై 11: ముఖ్యమంత్రి చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసీపీ నాయకులను అరెస్ట్ చేయాలని టీడీపీ నాయకులు గురువారం చంద్రగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా హైకోర్టు న్యాయవాది దద్దాల జగదీష్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి భారీవిజయాన్ని సాధించడంతో, ఘోర పరాజయం పాలైన వైసీపీ జీర్ణించుకోలేక చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. సీఎం చంద్రబాబుపై వైసీపీ అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్ హేళనగా మాట్లాడటమే కాకుండా.. జగన్ కనుసైగ చేసి ఉంటే చంపేస్తాం అనటాన్ని మాధ్యమాలలో, పత్రికలలో చూశామని, అతడిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. టీడీపీ నాయకులు కందేరి చంద్రబాబు నాయుడు, భాస్కర్ నాయుడు, మురళీధర్ నాయుడు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు పొట్లూరి రామారావు, నాయకులు శంకర్ మాదిగ, మండీ రావు, చంద్రమౌళి, సంగీతం రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.


హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు, కోర్టు సిబ్బంది

హెల్మెట్ వాడకంపై అవగాహన

పాకాల, జూలై 11: స్థానిక ఆర్టీసీ బస్టాండు కూడలివద్ద మండల న్యాయ సేవాసమితి, పోలీసుల ఆధ్వర్యంలో గురువారం హెల్మెట్ వాడకంపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి వాహనాలను నడపాలని కోరారు. న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించి, రోడ్డు భద్రత నిబంధనల గురించి వివరించారు. కోర్టు సిబ్బంది మధుసూదన్, ఏఎస్‌ఐ వెంకటరత్నం, కానిస్టేబుల్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమల ఘాట్‌లో ఏసీ బస్సుల దూకుడు

● అతివేగంతో భక్తుల ప్రాణాలతో చెలగాటం ● కాలపరిమితి నిబంధనకు తిలోదకాలు

తిరుమల, జూలై 11 (ఆంధ్రజ్యోతి): తిరుమల ఘాట్ రోడ్లలో ఏసీ బస్సులు భక్తుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయి. డ్రైవర్లు అతివేగంతో వీటిని నడుపుతూ ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. కార్లను, ద్విచక్ర వాహనాలను ఓవర్‌టేక్ చేస్తూ అతిగా వ్యవహరిస్తున్నారు. దూర ప్రాంతాలకు వెళ్లే భక్తుల కార్లతో పాటు టీటీడీ అధికారుల వాహనాలకు కూడా సైడ్ ఇవ్వకుండా దూకుడు ప్రదర్శిస్తున్నారు. తిరుమలలో పర్యావరణ పరిరక్షణకు తిరుమల-తిరుపతి మధ్య 62 ఎలక్ట్రికల్ ఏసీ బస్సులను తీసుకువచ్చిన విషయం తెలిసిందే. బస్సు తయారీ సంస్థ అవుట్ సోర్సింగ్ ద్వారా వీటికి డ్రయివర్లను నియమించుకుని ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చింది.

ఆ పరిమితికి కాలం చెల్లిందా..

ప్రమాదాల నివారణకు తిరుమల ఘాట్‌రోడ్లలో ప్రయాణానికి కాలపరిమితి ఉంది. తిరుమల నుంచి తిరుపతికి మొదటిఘాట్ రోడ్డులో 40 నిమిషాలు, తిరుపతి నుంచి తిరుమలకు రెండవ ఘాట్‌రోడ్డులో 28 నిమిషాల పరిమితి ఉంది. సమయానికంటే ముందుకు చేరుకుంటే ఆయా వాహనాలను మళ్లీ అనుమతించరు. తిరిగి అనుమతి పొందాలంటే శ్రీవారి కానుకగా అపరాధ రుసుం చెల్లించాలి. అప్పుడు టీటీడీ అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చి అనుమతిస్తారు. కానీ కొద్ది నెలలుగా అలిపిరి టోల్‌గేట్, తిరుమలలోని జీఎన్సీ టోల్‌గేట్‌లో వాహనాల సమయాన్ని సక్రమంగా తనిఖీలు చేయడం లేదనే విమర్శ ఉంది. అప్లికేషన్ డెవలప్ చేస్తున్నామంటూ అధికారులు కారణం చెప్పుకొస్తున్నారు. ఇదే అదనుగా చేసుకుని ఏసీ బస్సుల డ్రైవర్లు మితిమీరిన వేగంతో నడుపుతున్నారు. కాల పరిమితి నిబంధన లేకపోవడంతో వాహనాలను ఓవర్‌టేక్ చేస్తూ దూసుకుపోతున్నారు. దీంతో భక్తుల ప్రాణాలను గాల్లో దీపంగా మారుస్తున్నారు. భారీ మలుపుల్లో కూడా వేగాన్ని తగ్గించడం లేదు. గతంలో లారీలు, ప్రైవేట్ బస్సులు నడిపిన వ్యక్తులను ఎలక్ట్రికల్ ఏసీ బస్సుల డ్రైవర్లుగా నియమించడంతోనే ఇలాంటి పరిస్థితి నెలకొందనే విమర్శలు వస్తున్నాయి. రాత్రివేళలో కొంతమంది ఏసీ బస్సుల్లో ఎక్కే యాత్రికుల నుంచి నగదు వసూలు చేసి టికెట్లు ఇవ్వడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.


కారుకు సైడ్ ఇవ్వకుండా వరుసగా వెళుతున్న బస్సులు


ముందు వెళుతున్న వాహనాలను ఓవర్‌టేక్ చేస్తున్న ఏసీ బస్సు

రెండేళ్లలోనే తుక్కుతుక్కు

డ్రైవర్ల తీరుతో ఏసీ బస్సులు తుక్కుతుక్కయ్యాయి. ఘాట్‌రోడ్లలో అక్కడక్కడ క్రాష్ బ్యారియర్లను, ముందు వెళుతున్న వాహనాలను ఢీ కొట్టడంతో బస్సుల్లో 40 శాతంపైగా ధ్వంసమైన దృశ్యాలే కనిపిస్తున్నాయి. రెండేళ్లు కాకుండానే పగిలిన లైట్లు, విరిగిన భాగాలతో ఈ బస్సులు రూపం మారిపోయింది. కొత్త బస్సులు కాస్తా చెత్త బస్సులుగా మారిపోతున్నాయి.

నిత్యావసరాల ధరల తగ్గింపునకు చర్యలు

● ఎంపీ దగ్గుమళ్ల, ఎమ్మెల్యే నాని

చంద్రగిరి, జూలై 11: రాష్ట్రంలో పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, అందులో భాగంగానే పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో హోల్ సేల్ ధరలకే కందిపప్పు, బియ్యం సరఫరా చేస్తున్నట్లు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. గురువారం చంద్రగిరిలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా రైస్‌మిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్, హోల్‌సేల్ కిరణా మర్చంట్స్ అసోసియేషన్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన నాణ్యమైన బియ్యం ప్రత్యేక విక్రయ కేంద్రాన్ని స్వర్ణ సూపర్ మార్కెట్‌లో ఎంపీ, ఎమ్మెల్యే ప్రారంభించారు. ఇక్కడ కేజీ బియ్యం రూ.48, స్టీమ్ బియ్యం రూ.49, కందిపప్పును రూ.160లకు హోల్‌సేల్ ధరలకు విక్రయించారు. ఎంపీ దగ్గుమళ్ల మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో భాగంగా ప్రజలకు నాణ్యమైన బియ్యం, కందిపప్పు హోల్‌సేల్ ధరలకే అందచేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటాయని, ధరలు తగ్గించేందుకు చంద్రబాబు చర్యలు చేపట్టారని పేర్కొన్నారు. చరిత్రలో ఎరుగని మెజార్టీతో చంద్రగిరిలో తనను గెలిపించారని, అలాంటి ప్రజలను మోసం చేయనని చెప్పారు. వైసీపీ పత్రికలో తప్పుడు సమాచారం ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మారుతి, ఎంపీడీవో వెంకట సూర్యసాయి, పీఏడీటీ యుగంధర్, టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, సీనియర్ నాయకులు కుమారరాజా రెడ్డి, రమేష్‌రెడ్డి, నాగరాజ నాయుడు తదితరులు పాల్గొన్నారు.


స్వర్ణ సూపర్ మార్కెట్‌లో నిత్యావసరాలను విక్రయిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

ఆధారాల్లేకుండా నాపై బురద చల్లుతున్నారు

ఆపకుంటే వైసీపీ నేతల భూబాగోతాలన్నీ బయటకు తీస్తానన్న ఎమ్మెల్యే నాని

తిరుచానూరు, జూలై 11 : వైసీపీ నాయకుల్లా తాను అవినీతికి పాల్పడబోనని ఎమ్మెల్యే పులివర్తి నాని స్పష్టం చేశారు. చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావుతో కలిసి గురువారం తిరుచానూరులోని రఘునాథ రిసార్ట్స్‌లో వున్న టీడీపీ కార్యాలయంలో కూటమి నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి అవినీతి గురించి మాట్లాడితే నీలి మీడియాలో ఆధారాల్లేని వార్తలు రాయిస్తూ తనపై బురద చల్లుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తన పేరు చెప్పి ఎవరు అవినీతికి పాల్పడినా సహించబోనన్నారు.అభివృద్ధికి సలహాలు ఇస్తే పార్టీలకు అతీతంగా స్వీకరిస్తామని, అలా కాకుండా పదే పదే బురద జల్లే ప్రయత్నం చేస్తే 2020నుంచి 2024 వరకు జరిగిన వైసీపీ నాయకుల భూబాగోతాలన్నీ బయటకు తీస్తానని హెచ్చరించారు.తనపల్లిలో ఓ రైస్‌మిల్ యజమానిని డబ్బులడిగినట్లు, ఇవ్వకుంటే మూసివేయించినట్లు ప్రచారం చేశారని, నిజానికి స్థానికుల ఫిర్యాదు ఆధారంగా కాలుష్య నివారణ అధికారులు పరిశీలించి సీజ్ చేశారని తెలిపారు.చంద్రగిరిలో ఇల్లు కట్టుకోవడానికి స్థలాలు పరిశీలిస్తున్నానని, ఈ క్రమంలో రెండు ఎకరాలు చూసినట్లు చెప్పారు. ఆ స్థలం వైసీపీకి చెందిన ఒక కాంట్రాక్టర్‌ది అని తెలిసి విరమించుకున్నట్లు వివరించారు. ఇంతలో కాంట్రాక్టర్‌ను బెదిరించి రూ.7కోట్ల భూమి రాయించుకున్నానని ప్రచారం చేయించారన్నారు. కమీషన్లు తీసుకుని బతకాల్సిన అవసరం తనకు లేదని...పక్కా వైట్‌మనీతో స్థలాన్ని కొనుగోలు చేసి అందుకు సంబంధించిన రికార్డులను కూడా మీడియాకు అందజేస్తామన్నారు.రూ.57కోట్ల మఠం భూమి కబ్జా చేశానంటూ ప్రచారం చేయించారని,ఆ స్థలం అవధాన ప్రముఖుడు మేడసాని మోహన్‌కు చెందిందన్నారు. ఆ స్థలం అన్యాక్రాంతం అవుతుంటే అప్పటి డీఎస్పీ నరసప్ప, ఎస్పీ దృష్టికి తీసుకెళ్లి కాపాడినట్లు తెలిపారు. ప్రతిపక్ష నేతకు మరింత భద్రత కావాలంటే తన గన్‌మెన్‌ను పంపుతానని తెలిపారు.రాయలచెరువు కట్ట పటిష్ఠత విషయమై ఇరిగేషన్ అధికారులతో చర్చిస్తున్నట్లు తెలిపారు.వరదలకు కొట్టుకుపోయిన వంతెనల నిర్మాణానికి రూ.53 కోట్లు అవసరమని, ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి నిధులు విడుదల చేయిస్తామని వివరించారు.ప్రస్తుతం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలుకు కార్యాచరణ మొదలుపెట్టినట్లు తెలిపారు.ప్రతి నెలా గ్రీవెన్స్ నిర్వహించి కార్యకర్తల సమస్యలు తెలుసుకుంటామన్నారు.

హామీలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తాం

● ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను సాధ్యమైనంత త్వరలో నెరవేరుస్తామని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు తెలిపారు. ఇప్పటికే ఉద్యోగుల సమస్యలను, మామిడి రైతుల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో కేంద్రం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. రెండు నెలల తరువాత ఈ సమస్యలన్నీ ఒక కొలిక్కి వచ్చే అవకాశముందని తెలిపారు. చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్ తదితరులు పాల్గొన్నారు.

హనుమంత వాహనంపై కల్యాణ వెంకన్న అభయం



చంద్రగిరి, జూలై 11: శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో సాలకట్ల సాక్షాత్కార వైభవోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి హనుమంత వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ఆలయ ముఖ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. రాత్రి 7 గంటలకు స్వామివారి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి హనుమంత వాహనంపై ఊరేగించారు. శుక్రవారం రాత్రి గరుడ వాహనంపై స్వామివారు భక్తులను అనుగ్రహించనున్నారు. ఆలయ ప్రత్యేకశ్రేణి డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, మునిచెంగల్రాయులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆరాధన విధానానికి మూలం వైఖానస భగవత్ శాస్త్రం

● తిరుమల వైఖానస ట్రస్టు అధ్యక్షుడు రాఘవదీక్షితులు

తిరుమల, జూలై 11 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆరాధన విధానానికి మూలం వైఖానస మహర్షి రచించిన వైఖానస భగవత్ శాస్త్రమని తిరుమల వైఖానస ట్రస్టు అధ్యక్షుడు రాఘవ దీక్షితులు అన్నారు. తిరుమల ఆస్థానమండపంలో గురువారం వైఖానస దివ్య సిద్ధాంత వివర్ధిని సభ, టీటీడీ ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో మరీచి మహర్షి తిరు నక్షత్రోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాఘవ దీక్షితులు మాట్లాడుతూ.. వైఖానస భగవత్ శాస్త్రం వేదంతో కూడినదని, దేవాలయ సంస్కృతికి మూలమైన వేదమంత్రాలతో జరిపే వైఖానస ఆరాధన తిరుమల శ్రీవారికి అత్యంత ప్రీతిపాత్రమైనదని తెలిపారు. వేల సంవత్సరాలుగా శ్రీవారికి పూజలు, ఉత్సవాలు వైఖానస ఆగమం ప్రకారం జరుగుతున్నాయన్నారు. ఈ ఆగమ శాస్త్రాన్ని మరీచి మహర్షి విమానార్చనకల్పం, ఆనంద సహిత గ్రంథాలలో విధివిధానాలతో సమగ్రంగా వివరించారన్నారు. సనత్‌కుమార్ ప్రసంగిస్తూ మరీచి మహర్షి అందించిన శాస్త్ర గ్రంథాలపై పరిశోధనలు జరిపాలన్నారు. ఎస్వీ వేద విశ్వవిద్యాలయం ఆగమశాస్త్ర ఆచార్యులు భావనారాయణాచార్యులు మాట్లాడుతూ.. తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు వైఖానస భగవత్ శాస్త్రంలో చెప్పబడిందని, ఈ ఉత్సవ నిర్వహణ, సందర్శన వల్ల భక్తులకు అశ్వమేధ యాగం చేసిన ఫలం లభిస్తుందన్నారు. వైఖానస ట్రస్ట్ ట్రస్టీ శ్రవణ్ కుమార్, కార్యదర్శి ప్రభాకర్ ఆచార్యులు దేవాలయాల విశిష్టత, అర్చన, పూజా విధానాలను వివరించారు. ముందుగా ధర్మగిరి వేద విజ్ఞానపీఠం అధ్యాపకులు, విద్యార్థులు స్తోత్ర పఠనంతో మంగళ నీరాజనాలు చేశారు. ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్ట్ అధికారి పురుషోత్తం, ఇతర అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా చెత్త సంపద తయారీ కేంద్రాలు..!

తిరుపతి రూరల్, జూలై 11: చెత్తనుంచి సంపదను సృష్టించడంతో పాటు గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలనే ఉన్నతాశయంతో 2014లో అధికారం చేపట్టిన టీడీపీ ప్రభుత్వం పంచాయతీకి ఒకటి చొప్పున డంపింగ్ యార్డ్‌ను, చెత్త సంపద తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. వీటి నిర్వహణకు అవసరమైన సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చారు. 2019లో అధికారం చేపట్టిన వైసీపీ పాలకులు ఐదు సంవత్సరాలపాటు ఈ సంపద తయారీ కేంద్రాలను నిరుపయోగంగా మార్చేశారు. క్షేత్రస్థాయిలో ఇవి ఎక్కడా పని చేయలేదు. వర్మీకంపోస్టు ఎరువు ద్వారా రైతులకు ఆదాయమూ సమకూరకపోవడంతో టీడీపీ ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోయింది. కాగా తిరుపతి రూరల్ మండల పరిధిలో 25 సంపద తయారీ కేంద్రాలను నిర్మించారు. వీటిలో దుర్గసముద్రం, సాయినగర్ పంచాయతీల్లో నిర్మించిన కేంద్రాలు వర్షాలకు కొట్టుకుపోగా.. తుమ్మలగుంట, గొల్లపల్లె పంచాయతీల్లోని కేంద్రాలు పాడైపోయాయి. ప్రస్తుతం 9 పంచాయతీల్లో (సి.మల్లవరం, పెరుమాళ్లపల్లె, పద్మావతిపురం, తిరుచానూరు, అవిలాల, వేదాంతపురం, పేరూరు, చిగురువాడ, బ్రాహ్మణపట్టు) మాత్రమే ఉన్నాయి. కాగా బైఫర్‌కేషన్ తర్వాత ఏర్పాటైన 9 కొత్త పంచాయతీల్లో వీటి నిర్మాణం జరగలేదు. కాగా ఈ సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా ఉండటంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. పల్లెలో ఎక్కడ చూసినా చెత్త, వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సంపద తయారీ కేంద్రాలను తిరిగి అందుబాటులోకి తెస్తారని ప్రజలు ఆశిస్తున్నారు. వీటిని ఆచరణలోకి తెస్తే రైతులకు ఉపయోగంతోపాటు పంచాయతీలకు ఆదాయం కూడా సమకూరుతుంది.


మల్లంగుంటలో ఏర్పాటు చేసిన చెత్త సంపద తయారీ కేంద్రం, వ్యర్థాలు

పంచాయతీలను పరిశుభ్రంగా ఉంచాలి


చెత్తకుండీలను పరిశీలిస్తున్న డివిజనల్ పంచాయతీ అధికారి సుశీలాదేవి

మంగళం, జూలై 11: మంగళం పరిధిలో పంచాయతీలను పరిశుభ్రంగా ఉంచాలని డివిజనల్ పంచాయతీ అధికారి రూపాదేవి సూచించారు. గురువారం మంగళం పరిధిలోని సప్తగిరికాలనీ పంచాయతీలో ఆమె పర్యటించారు. చెత్త నిర్వహణ, ఎప్పటికపుడు ఇంటింటి చెత్త సేకరణ, చెత్త కుండీలను పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ కార్యదర్శి విజయభాస్కర్‌ను ఆదేశించారు. సప్తగిరికాలనీ, మంగళం పంచాయతీల మధ్య చెత్త సేకరణ వివాదానికి పరిష్కారం చూపారు. నెలలో రెండు పంచాయతీలకు చెందిన పారిశుధ్య కార్మికులు చెత్తను చెత్తకుండీల వద్ద శుభ్రం చేసే విధంగా ఆదేశాలు జారీ చేశారు. పెరుగుతున్న జనాభా దృష్ట్యా చెత్త నిర్వహణకు నూతన ప్రణాళికలను సిద్ధం చేసి కలెక్టర్‌కు ప్రతిపాదనలను పంపుతామన్నారు.

తలకోన నీటిని సాగుకు మళ్లించడమే లక్ష్యం

● ఎమ్మెల్యే నాని


ఎమ్మెల్యే నానీని కలిసిన తలకోన నీటి సాధన కమిటీ సభ్యులు

ఎర్రావారిపాలెం, జూలై 11: శేషాచలం అడవుల్లోని వర్షపునీటిని సాగుకు మళ్లించడమే ధ్యేయమని ఎమ్మెల్యే పులివర్తి నాని పేర్కొన్నారు. తలకోన నీటి సాధన కమిటీ అధ్యక్షుడు మారెళ్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో రైతులు గురువారం తిరుపతిలో ఎమ్మెల్యే నానీని కలిశారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ ఎర్రావారిపాలెం, చిన్నగొట్టిగల్లు మండలాల్లోని చెరువులకు తలకోన వర్షపు నీటిని మళ్లించి సాగుకు ఉపయోగించడమే ప్రథమ లక్ష్యమన్నారు. కళ్లెదుటే నీరు వృథాగా పోతున్నా తమ పొలాలకు వాడుకోలేని నిస్సహాయ స్థితిలో ఈ మండలాల రైతులు ఉండటం తనను ఎంతగానో బాధించిందన్నారు. వర్షపు నీటి వినియోగంపై అధ్యయనం చేయాలని వారం క్రితం ఇరిగేషన్ శాఖ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించిన విషయం విదితమే. త్వరలోనే అధికారుల నివేదికను పరిశీలించి ప్రభుత్వ అనుమతి కోసం ప్రయత్నిస్తానని ఎమ్మెల్యే తెలిపినట్లు మారెళ్ల శ్రీనివాసులు ఈసందర్భంగా చెప్పారు. కమిటీ సభ్యులు అంజయ్య, పాటూరి రెడ్డెప్ప, బొమ్మల జగదీష్, మణి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే సంగతులు

● వడ్డికాల్వ వద్ద కోతకు గురైన రహదారి

రామచంద్రాపురం, జూలై 11: తిరుపతి - పచ్చికాపల్లం ప్రధాన రహదారి కుప్పంబాదూరు సమీపంలో వడ్డికాల్వ వద్ద 20 మీటర్ల దూరం రోడ్డు కోతకు గురైంది. ఏమాత్రం ఆదమరచినా వాహనదారులు పది అడుగుల లోతు పొలాల్లో పడిపోయే పరిస్థితి. రాయలచెరువు కట్ట నుంచి అరకిలోమీటరు దూరం బోదగుట్ట అడవి నుంచి వర్షపునీరు రహదారిపైకి వచ్చింది. దీంతో రోడ్డు కోతకు గురైంది. వాహన చోదకులు ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా బోల్తా పడే పరిస్థితి. రాత్రివేళ పొరబాటున రోడ్డు అంచుల్లో వాహనం నడిపినా అధోగతే. అధికారులు కోతకు గురైన చోటరోడ్డుకు భద్రత గోడ ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇదే ప్రదేశంలో అడవి నీరు వచ్చేందుకు కల్వర్టు ఏర్పాటు చేస్తే నిల్వ చేరకుండా రాయలచెరువులోకి వెళుతుంది.


వడ్డికాల్వ వద్ద కోతకు గురైన తిరుపతి - పచ్చికాపల్లం ప్రధానరహదారి

మోదుగులపాళెం అభివృద్ధికి కృషి

మోహన్‌బాబు


పీర్ల ఉత్సవానికి మోహన్‌బాబును ఆహ్వానిస్తున్న మోదుగులపాళెం గ్రామస్తులు

ఏర్పేడు, జూలై 11: మోదుగులపాళెంలో పీర్ల పండగకు సినీనటుడు మోహన్‌బాబును ఆ గ్రామస్తులు గురువారం ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వగ్రామంలో కులమతాలకు అతీతంగా పీర్లపండుగ నిర్వహించడం సంతోషకరమన్నారు. గ్రామ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. గ్రామస్తులు కలసికట్టుగా ఉండాలన్నారు. దయాకర్ మొదలియార్, శివకుమార్, కిరణ్‌కుమార్, చంద్రశేఖర్ చౌదరి, భరత్‌కుమార్, మంచుమస్తాన్ నాయుడు తదితరులు ఉన్నారు.

సూచికలిలా ఉంటే ఎలా?



తిరుపతి (ఆర్టీసీ), జూలై 11: సెంట్రల్ బస్సు స్టేషన్‌లోని పల్లె వెలుగుబస్టాండులో ఉన్న సూచిక బోర్డులు మసక బారి, ఊర్ల పేర్లు చెరిగి పోయి ఉన్నాయి. ఇక్కడ మొత్తం ఎనిమిది ప్లాట్‌ఫామ్స్ ఉండగా, బోర్డులు మాత్రం నాలుగే ఉన్నాయి.ఉన్నవి కూడా సరిగా లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.ఇక్కడ తాగునీరు, ఫ్యాన్లు వంటి సౌకర్యాలు లేవు. సిబ్బందిని అడిగితే పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి సమస్యలపై ఉన్నతాధికారులు దృష్టి పెట్టాల్సి ఉంది.

నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి: సీఐటీయూ



బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట నిరతెలుపుతున్న నాయకులు

తిరుపతి(ఆటోనగర్), జూలై 11: కేంద్ర ప్రభుత్వం సవరించిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.బాలసుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. బీఎస్ఎన్ఎల్ జిల్లా కార్యాలయం ఎదుట నగర కమిటీ ఆధ్వర్యంలో గురువారం జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. కార్మిక వర్గాన్ని బానిసలుగా మార్చడానికే చట్ట సవరణలు చేశారని విమర్శించారు. నాయకులు మధు, వేణుగోపాల్, జయచంద్ర, పి.బుజ్జి, రమేష్, మురళి, ఈఎస్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నారాయణమ్మకు స్విమ్స్‌లో 'ఆరోగ్యశ్రీ' అడ్మిషన్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తిరుపతి(వైద్యం), జూలై 11: ఆరోగ్యశ్రీ కింద స్విమ్స్‌లో అడ్మిషన్ లభించక ఈనెల ఆరో తేదీ నుంచి చిట్వేలు మండలం చెర్లోపల్లికి చెందిన నారాయణమ్మ ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయమై 'ఆరోగ్యశ్రీనా.. అయితే మళ్లీ రండి' శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన స్విమ్స్ అధికారులు వెంటనే ఆమె కుటుంబీకులతో మాట్లాడి అడ్మిట్ చేసుకున్నారు. దీంతో ఆమె కుటుంబీకులు స్విమ్స్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించాలి



కార్మికులతో యూనియన్ నేతలు

తిరుపతి (వైద్యం), జూలై 11: 'ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు మూడేళ్లుగా ఈఎస్ఐ, పీఎఫ్ ఇవ్వకుండా కాంట్రాక్టు నిర్వాహకులు వేధిస్తున్నారు. వెంటనే చెల్లించకుంటే ఆందోళనకు దిగాల్సి వస్తుంది' అని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్ర హెచ్చరించారు. ఆస్పత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులతో కలిసి వారు గురువారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. నిబంధన మేరకు ఇవ్వాల్సిన నాణ్యమైన యూనిఫాం, గుర్తింపు కార్డులు కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. ఈనెల 18న సూపరింటెండెంట్‌ను కలిసి సమస్యలపై వినతిపత్రం సమర్పిస్తామన్నారు. అప్పటికీ పరిష్కారం కాకుంటే ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు. నేతలు గుర్రమ్మ, వనజ, మునిరాజమ్మ, నాగజ్యోతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అంకురా ఆస్పత్రి ఎండీకి అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ వంశీకృష్ణ

తిరుపతి(వైద్యం), జూలై 11: తిరుపతిలోని అంకురా ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వంశీకృష్ణ యంగ్ పీడియాట్రీషియన్ ఆఫ్ ద ఇయర్ ఏపీ అవార్డును అందుకున్నారు. బెంగళూరులో జాతీయ స్థాయిలో గురువారం నిర్వహించిన ప్రైడ్ ఆఫ్ నేషన్ అవార్డు 2024 కార్యక్రమంలో అయన పాల్గొని ఈ అవార్డును అందుకున్నట్లు తెలిపారు. చిన్నారుల్లో వచ్చే అరుదైన వ్యాధులకు అధునాతన పద్ధతులతో వైద్యం అందించినందుకు ఈ అవార్డుకు ఎంపిక చేశారన్నారు. ఈ సందర్భంగా వంశీకృష్ణను అంకురా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది అభినందించారు.

డయాబెటిక్ రెటీనోపతిని నిర్లక్ష్యం చేయొద్దు



కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సుధారాణి

తిరుపతి (వైద్యం), జూలై 11: మధుమేహంతో బాధపడే వారిలో వచ్చే డయాబెటిక్ రెటీనోపతిని నిర్లక్ష్యం చేస్తే శాశ్వతంగా కంటి చూపును కోల్పోవాల్సి వస్తుందని ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ సుధారాణి తెలిపారు. తిలక్‌రోడ్డులోని శ్రీసాయిసుధా కంటి ఆస్పత్రిలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డయాబెటిక్ ఉన్న వారు క్రమం తప్పక ప్రతి మూడు నెలలకు ఒకసారి తప్పనిసరిగా కంటి స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. సిబ్బంది హిమబిందు, మహేష్, సునీత, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

9 మండలాల్లో వాన

తిరుపతి(కలెక్టరేట్), జూలై 11: జిల్లాలో బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు ఓ మోస్తరు వర్షం కురిసింది. మండలాల వారీగా వర్షపాతం వివరాలిలా ఉన్నాయి. సూళ్లూరుపేటలో 60.2, పెళ్లకూరులో 51.4, వెంకటగిరిలో 47.4, సత్యవేడులో 46.6, తొట్టంబేడులో 36.2, శ్రీకాళహస్తిలో 31.4, వరదయ్యపాళెంలో 28.2, బాలయపల్లిలో 27.4, కోట, చిట్టమూరుల్లో 27.2 మి.మీ. వర్షపాతం నమోదైంది.

ఎమ్మెల్యే భానుప్రకాష్‌కి అభినందన



ఎమ్మెల్యేని అభినందిస్తున్న సైకం జయచంద్రారెడ్డి

తిరుపతి రూరల్, జూలై 11: నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌ని ఏపీ సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సైకం జయచంద్రారెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలసి అభినందించారు. పుష్పగుచ్ఛం, దుశ్శాలువాతో సత్కరించారు.

తిరుమలకు పూర్వ వైభవం తేవడానికి సీఎం జోక్యం చేసుకోవాలి

ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు



మీడియాతో మాట్లాడుతున్న శ్రీనివాసానంద సరస్వతి

తిరుపతి(ఆటోనగర్), జూలై 11: తిరుమలకు పూర్వ వైభవం తేవడానికి సీఎం చంద్రబాబు జోక్యం చేసుకోవాలని ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి కోరారు. ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. తిరుమలలో గత వైసీపీ ప్రభుత్వం, అధికారులు అనుసరించిన తీరుతో సామాన్య భక్తులు దోపిడీకి గురికావడంతో పాటు, స్వామి కృపకు నోచుకోలేక పోతున్నారని చెప్పారు. తిరుమలలో శ్రీవారి రాజగోపురం కంటే ఎత్తుతో కూడిన కట్టడాలు నిర్మించరాదని శాస్త్రాల్లో ఉందన్నారు. అటువంటి కట్టడాలను తొలగించాలని కోరారు. గోగర్భం డ్యాం వద్ద ఉన్న వానమామలై మఠం, విశాఖ శారదా పీఠంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన నిర్మాణాలను కూల్చివేయాలన్నారు. మఠాల్లో ధార్మిక కార్యక్రమాలు కూడా నిర్వహించడం లేదని తెలిపారు. గోవిందరాజస్వామి ఆలయం చుట్టూ ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించాలని డిమాండ్ చేశారు. టీటీడీలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు హిందూ సంప్రదాయాలను ఆచరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ అంశాలపై గురువారం టీటీడీ ఈవోతో చర్చించామని తెలియజేశారు. గౌరవాధ్యక్షుడు ఎ.నారాయణరావు, ఓంకార్, భైరావానంద, గణేష్, శ్రీనివాసానంద, సుభానంద తదితరులు పాల్గొన్నారు.

డీఆర్ఎంకు అభినందనలు

తిరుపతి(సెంట్రల్), జూలై 11: దక్షిణ మధ్య రైల్వే గుంతకల్ డివిజన్‌మేనేజరు(డీఆర్ఎం)గా ఎం.విజయకుమార్ గురువారం బాధ్యతలు తీసుకున్నారు. ఆయనకు తిరుపతి స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, ఎస్ఎంఆర్, చిన్నప్పరెడ్డిలతో పాటు పలు శాఖల అధికారులు అభినందనలు తెలిపారు.

ఎస్వీయూ నాన్ టీచింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



శ్రీధర్ - సుబ్రహ్మణ్యం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 11: ఎస్వీ యూనివర్సిటీ నాన్ టీచింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. గురువారం ఇందుకు సంబంధించిన ఎన్నికలు, కౌంటింగ్ నిర్వహించారు. అధ్యక్షుడిగాగుర్రంకొండ శ్రీధర్, కార్యదర్శిగా నెల్లూరు సుబ్రహ్మణ్యం గెలుపొందారు. అధ్యక్ష స్థానానికి నిర్వహించిన ఎన్నికల్లో వెంకటేశ్వర్లుపై 71 ఓట్ల మెజారిటీతో శ్రీధర్ గెలిచారు. కార్యదర్శి స్థానానికి నిర్వహించిన ఎన్నికల్లో 82 ఓట్ల ఆధిక్యతతో సుబ్రహ్మణ్యం విజేతగా నిలిచారు. వీరిని అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఆర్కాట్ మణి, ఎన్ఎంఆర్ అసోసియేషన్ అధ్యక్షుడు జగదీష్, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనంద్‌గౌడ్, తదితరులు అభినందించారు.

విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపునకే పరిషత్‌లు

ఎన్ఎస్‌యూ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి



తిరుపతి రూరల్, జూలై 11: విద్యార్థులకు పలు భాషల్లో నైపుణ్యాలను పెంచేందుకు పరిషత్‌లను ఏర్పాటు చేశామని జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి తెలిపారు. వర్సిటీలో ఏర్పాటు చేసిన పలు పరిషత్తులను ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్రపతి పురస్కార గ్రహీత ప్రొఫెసర్ కె.రామసూర్యనారాయణతో కలసి వీసీ గురువారం ప్రారంభించారు. సంస్కృతభాషణం కోసం వాగ్వర్ధిని పరిషత్, తెలుగుకోసం అన్నమాచార్య కళా పరిషత్, హిందీ కోసం తులసీదాస్ పరిషత్, ఆంగ్ల భాషణం కోసం మాక్స్‌ముల్లర్ పరిషత్, కళలు, సంగీతం కోసం ఏర్పాటు చేసిన కళా పరిషత్‌లని ప్రారంభోత్సవం చేశారు. అకడమిక్ అఫైర్స్ డీన్ రజనీకాంత్‌శుక్లా, స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ సింగరాజు దక్షిణామూర్తిశర్మ, వివిధ పరిషత్‌ల కోఆర్డినేటర్లు, అడిషనల్ కోఆర్డినేటర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కంటి, స్కిన్ వైద్యశిబిరాలు

సంస్కృతవర్సిటీ ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి, స్కిన్ వైద్యశిబిరాలను వీసీ ప్రారంభించారు. అకడమిక్ అఫైర్స్ డీన్ రజనీకాంత్ శుక్లా, స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ సింగరాజు దక్షిణామూర్తిశర్మ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్వేత, సిబ్బంది పాల్గొన్నారు. కాగా, డాక్టర్ అగర్వాల్ కంటి ఆస్పత్రి, డాక్టర్ యుగంధర్ స్కిన్ క్లినిక్ నేతృత్వంలో నిర్వహించిన ఈశిబిరంలో విద్యార్థులు, ఉద్యోగులు హాజరై పరీక్షలు చేసుకున్నారని హెల్త్ సెంటర్ ఇన్‌చార్జి డాక్టర్ బాలదత్తాత్రేయ తెలిపారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



క్రికెటర్ శ్రీశాంత్

తిరుమల, జూలై 11 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. క్రికెటర్ శ్రీశాంత్, ఎంపీ గొల్ల బాబూరావు, కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, తెలంగాణ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, వెస్టబెంగాల్ మంత్రి బెచారం మున్నా ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

హుండీ ఆదాయం రూ.3.05కోట్లు: శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.05కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం లెక్కించి,గురువారం ఉదయం ప్రకటించింది.బుధవారం 73,353మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 28,444 మంది తలనీలాలు సమర్పించారు.

ఎన్డీఏ శ్రేణులను ఇబ్బంది పెట్టిన వైసీపీ నేతలకు శిక్ష తప్పదు

ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



సమావేశంలో ప్రసంగిస్తున్న ఆరణి శ్రీనివాసులు

తిరుపతి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ కూటమి నేతలు, కార్యకర్తలపై దౌర్జన్యం చేసిన వైసీపీ నాయకులు శిక్ష అనుభవించక తప్పదని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హెచ్చరించారు. డివిజన్ స్థాయిలో ఎవరెవరు కూటమి నేతలను ఇబ్బంది పెట్టారో గుర్తించాలని జనసేన, తెలుగుదేశం, బీజేపీ నాయకులను కోరారు. గురువారం 23, 24, 25, 29 డివిజన్ల కృతజ్ఞతా సమావేశం వేశాలమ్మ ఆలయ సమీపంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి బుల్లెట్ రమణ ఆధ్వర్యంలో జరిగింది. అలాగే 30, 31, 36, 37 డివిజన్ల సమావేశం టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి దంపూరి భాస్కర్ యాదవ్ అధ్యక్షతన జరిగింది. ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలపై దౌర్జన్యం చేసిన వైసీపీకి చెందిన నాయకులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆయా పార్టీలోకి చేర్చుకోరాదని నేతలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. 30వ డివిజన్‌లో అంగన్వాడీ భవనం, రజకుల కమ్యూనిటీ హాల్ నిర్మాణంతోపాటు అసంపూర్తిగా ఉన్న వీరభద్రస్వామి ఆలయాన్ని పూర్తి చేయాలని స్థానికులు విన్నవించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తిరుపతిలో భూమన కరుణాకరరెడ్డి అరాచకాలను పంటిబిగువున భరించిన ప్రజలు.. ఆయన కుమారుడిని చిత్తుగా ఓడించి బుద్ధి చెప్పారన్నారు. అఖండ మెజార్టీ ఇచ్చిన ప్రజల సమస్యలను పరిష్కరించి.. రుణం తీర్చుకుంటానని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, నాయకులు నరసింహ యాదవ్, మబ్బు దేవనారాయణ రెడ్డి, జేడబ్ల్యూ విజయ్ కుమార్, చినబాబు, మహేష్ యాదవ్, విజయలక్ష్మి, రాజారెడ్డి, ఆకేపాటి సుభాషిణి, చుక్కల దాము, ఆముదాల తులసీరాం, అజయ్ కుమార్, పొనగంటి భాస్కర్, వరప్రసాద్, ఆర్కాట్ కృష్ణప్రసాద్, ముక్కు సత్యవంతుడు, సుబ్బు యాదవ్, వినోద్ రాయల్, బెల్లంకొండ సురేష్, వెంకట్ రాయల్, ఆముదాల వెంకటేష్, కట్టా జయరామ్, అశోక్ కుమార్, పోటుకూరి ఆనంద్, శంకర్ యాదవ్, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించాలి



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో శ్రీహరి

తిరుపతి(వైద్యం), జూలై 11: ప్రతి ఒక్క రూ కుటుంబ నియంత్రణ పద్ధతులు పా టించాలని డీఎంహెచ్‌వో శ్రీహరి అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి స్విమ్స్ సర్కిల్ వరకు వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రుయా సూపరింటెండెంట్ రవిప్రభు, డీపీఎంవో శ్రీనివాసులు, డీఐవో శాంతకుమారి, డీఎంవో రూప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న ప్రకాశ్‌బాబు

తిరుపతి(విద్య): టీటీడీ ఆధ్వర్యంలోని ఎస్వీ జూనియర్ కళాశాలలో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ ప్రకాశ్‌బాబు మాట్లాడుతూ.. పెరుగుతున్న జనాభాతో ఎన్నో సవాళ్లు ఎదురతువుతున్నాయని చెప్పారు. అధ్యాపకులు డి.అనురాధ, సీఎల్ చెన్నారెడ్డి, ప్రసన్నలక్ష్మి, మహేశ్వరయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుపతి (విశ్వవిద్యాలయాలు): ఎస్వీయూ పాపులేషన్ స్టడీస్ విభాగంలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మనాభం, సెట్విన్ సీఈవో మురళీకృష్ణ, పాపులేషన్ స్టడీస్ హెడ్ చంద్రశేఖరయ్య, సోషియల్ వర్క్ కో-ఆర్డినేటర్ సాయి సుజాత, తదితరులు ప్రసంగించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాసా పోటీల్లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ



తిరుపతి (విద్య), జూలై 11: జీఎస్ మాడ వీధికి చెందిన శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు నాసా స్పేస్ సెటిల్‌మెంట్ పోటీల్లో ప్రతిభ చూపారని ప్రిన్సిపాల్ జయప్రకాశ్ తెలిపారు. తమ విద్యార్థులు రూపొందించిన ఆర్టెమిస్ స్పేస్ కాలనీ ప్రాజెక్టుకు జాతీయస్థాయిలో మూడో బహుమతి వచ్చిందన్నారు. ఈప్రాజెక్టుల్లో 12మంది విద్యార్థులు భాగస్వాములైనట్లు వివరించారు. స్కూల్‌లో గురువారం విద్యార్థులకు నిర్వహించిన అభినందన సభలో ఏజీఎం జి.సురేష్ మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో ప్రతిభ చాటడం సంతోషంగా ఉందని అన్నారు. వైస్ ప్రిన్సిపాల్ కిశోర్‌బాబు, డీన్ సురేష్, సీఅండ్ఎం ఇన్‌చార్జి నరేంద్రబాబు, టీచర్లు పాల్గొన్నారు.

రాత్రి గస్తీపై నిర్లక్ష్యం వహిస్తే సహించను

సిబ్బందికి ఎస్పీ హెచ్చరిక - తిరుపతి, చంద్రగిరిలో తనిఖీలు



అలిపిరి చెక్ పాయింటు వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

తిరుపతి (నేరవిభాగం), జూలై 11: రాత్రి గస్తీపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని సిబ్బందిని ఎస్పీ హర్షవర్ధనరాజు హెచ్చరించారు. గురువారం రాత్రి 9.30 గంటల నుంచి తిరుపతి, చంద్రగిరిలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. చోరీలు, దోపిడీలు, అల్లర్లు, ఘర్షణలు జరగకుండా చూసుకోవాలన్నారు. అప్పుడే ప్రజలకు పోలీసులపై నమ్మకం కలుగుతుందని చెప్పారు. తిరుపతిలోని వెస్ట్, ఈస్ట్‌స్టేషన్లతోపాటు నగరంలో పలు ప్రాంతాలను తనిఖీ చేశారు. అలిపిరి చెక్ పాయింటును కూడా పరిశీలించారు. రాత్రిపూట రోడ్లపై తిరుగుతున్న యువతకు కౌన్సెలింగ్ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కొన్నిచోట్ల నిర్దేశించిన సమయం తర్వాత కూడా దుకాణాలు తెరచి ఉండటం చూసి అసంతృప్తి వ్యక్తం చేశారు. రాత్రి గస్తీలోని సిబ్బంది తమ బీటు పరిధిలోని రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లు, హిస్టరీ షీటర్లను కచ్చితంగా తనిఖీ చేసి.. బీట్ పుస్తకంలో నమోదు చేయాలన్నారు. గతంలో నేరాలు జరిగిన ప్రదేశాలపై నిఘా పెట్టాలన్నారు. ఎస్పీవెంట అదనపు ఎస్పీలు కులశేఖర్, శ్రీనివాసరావు, డీఎస్పీలు రవిమనోహరాచారి, నరసింగప్ప, రమణకుమార్, సీఐలు, ఎస్ఐలు, స్పెషల్ పార్టీ పోలీసులున్నారు.

'మా సమస్యను డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లండి'

తిరుపతి అర్బన్, జూలై 11: తమ సమస్యను డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లాలని తిరుమల నిర్వాసితులు గురువారం సాయంత్రం జనసేన తిరుపతి ఇన్‌చార్జి కిరణ్‌రాయల్‌కు వినతి పత్రం అందజేశారు. తిరుమలలో నివసిస్తున్న సుమారు 400మందిని తిరుపతికి నివాసం మార్చుకుంటే కుటుంబానికి ఓ ఉద్యోగం ఇస్తామని ఆనాటి టీటీడీ బోర్డు హామీ ఇచ్చిందన్నారు. అందరికీ శాశ్వత ఉద్యోగం ఇవ్వలేదన్నారు. ఎల్లయ్య, శ్రీనివాసులు, వాసు, కుమార్, వెంకటనిరంజన్, గుప్తా, ప్రవీణ్, కుమార్ పాల్గొన్నారు.

బీటెక్ ఫలితాలు విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు): పద్మావతి మహిళా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ బీటెక్ సెమిస్టర్ పరీక్షలు మేలో నిర్వహించారు. ఫలితాలు విడుదల వగా ఎస్‌పీఎంవీవీ.. వెబ్‌సైట్‌లో పొందుపరిచారు.



మోటారు సైకిలిస్టులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి : జడ్జి సంయుక్త



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి సంయుక్త

నాయుడుపేట టౌన్, జూలై 11 : మోటారు సైకిలిస్టులు ప్రయాణాలు చేసేటప్పుడు తప్పనిసరిగా ప్రాణరక్షణ కోసం హెల్మెట్ ధరించాలని జడ్జి సంయుక్త అన్నారు. నాయుడుపేట జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో గురువారం న్యాయవిజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోవడం, క్షతగాత్రులు కావడం జరుగుతుంటుందని, హెల్మెట్ ధరించడం ద్వారా రక్షణగా ఉంటుందన్నారు. నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి మండలాల పోలీస్ అధికారులతో మాట్లాడుతూ హెల్మెట్లు తప్పనిసరిగా ధరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పసల గంగాప్రసాద్, న్యాయవాదులు పసల చెంగయ్య, పార్థసారధిరెడ్డి, చదలవాడ కుమార్, కిషోర్ ఉన్నారు.

గూడూరుకు చేరుకున్న పాదయాత్ర



టీడీపీ నాయకులకు పండ్లు అందజేస్తున్న స్థానిక టీడీపీ నేత

గూడూరు, జూలై11: టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే తిరుమలకు పాదయాత్రగా వచ్చి స్వామివారి దర్శనం చేసుకుంటామని మొక్కుకున్న బాపట్ల జిల్లాకు చెందిన టీడీపీ నాయకులు చేపట్టిన పాదయాత్ర గురువారం గూడూరుకు చేరుకుంది. దీంతో స్థానిక టీడీపీ నాయకుడు ఏసుపాక పెంచలయ్య వారికి పండ్లు అందజేసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పెంచలయ్య మాట్లాడుతూ బాపట్ల జిల్లా కొల్లూరు మండలం నుంచి టీడీపీ రాష్ట్ర తెలుగుయువత అధికార ప్రతినిధి మధుసూదన్‌ప్రసాద్ ఆధ్వర్యంలో 60 మంది టీడీపీ నాయకులు తిరుమలకు పాదయాత్ర చేస్తున్నారన్నారు. ఈ ఎన్నికల్లో కూటమి విజయం సాధించడంతో మొక్కులు చెల్లించుకునేందుకు వీరు కొల్లూరు నుంచి చేపట్టిన పాదయాత్ర 11వ రోజు గూడూరుకు చేరుకోవడంతో వారికి సంఘీభావం తెలిపామన్నారు.

క్రోనోకార్పస్ మొక్కలను తొలగించాలి

గూడూరు, జూలై 11: పట్టణంలోని డివైడర్ల మధ్యలో ఉన్న క్రోనోకార్పస్ మొక్కలను తొలగించాలని ఉమ్మడి నెల్లూరుజిల్లా జనసేన ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జనసేన ఆధ్వర్యంలో కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రోనోకార్పస్ మొక్కల వలన పర్యావరణానికి హాని కలుగుతుందన్నారు. భూగర్భజలాలు అడుగంటిపోయి మానవ మనుగడకు ప్రమాదకరంగా మారుతుందన్నారు. మొక్కలను తొలగించి వీటి స్థానాల్లో పర్యావరణానికి మేలు చేసే మొక్కలను ఏర్పాటు నాటాలన్నారు. కార్యక్రమంలో విజయ్, సుమన్, హరి పాల్గొన్నారు.

కార్మిక సమస్యల పరిష్కారానికి ఈయూ కృషి



జెండాను ఆవిష్కరిస్తున్న ఈయూ నాయకులు

గూడూరు అర్బన్, జూలై 11: ఆర్టీసీ కార్మికుల, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎంప్లాయిస్ యూనియన్ కృషి చేస్తుందని యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్రమణ్యంరాజు అన్నారు. గురువారం స్థానిక ఆర్టీసీ డిపో వద్ద ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీలో పనిచేసే కార్మికులు, ఉద్యోగుల సంక్షేమం కోసం ఎంప్లాయిస్ యూనియన్ అనేక పోరాటాలు సాగించి సమస్యలను పరిష్కరించు కోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నారాయణ, సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న వైద్యులు

సూళ్లూరుపేట, జూలై 11: ప్రభుత్వ ఆస్పత్రిలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే విజయశ్రీ అన్నారు. గురువారం సూళ్లూరుపేట సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఎమ్మెల్యేను అక్కడ పనిచేసే వైద్యులు, సిబ్బంది ఘనంగా సన్మానించి సత్కరించారు. వైద్య వృత్తిలో ఉంటూ తొలి మహిళా ఎమ్మెల్యేగా విజయం సాధించిన ఆమెను వైద్యశాలలో సన్మానించడం సంతోషంగా ఉందని వైద్యుడు రమేషన్ అన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు, అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిధులు వచ్చేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ, అధ్యక్ష, కార్యదర్శిలు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, టీడీపీ నాయకులు నెలవల రాజేష్, పార్థసారధి, వెంకటేశ్వర్లు రెడ్డి, మాధవనాయుడు, బుజ్జిబాబు, పెంచలయ్య పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న ఎంఈవో తదితరులు

పెళ్లకూరు, జూలై 11 : మండలంలోని యడఘాడి ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఎంఈవో మించల శంకరయ్య గురువారం విద్యార్థుల తల్లిదండ్రులతో కలసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరు మీద మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. అనంతరం నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించి బడి ఈడు పిల్లలు బడిలో చేరేలా తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఏ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పుష్పలత, శివనాగరాజు, సీఆర్పీ సీహెచ్ బాబు, విద్యాకమిటీ చైర్మన్ యోగేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం కార్డు మార్చి నగదు చోరీ

నాయుడుపేట టౌన్, జూలై 11 : పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉన్న రెండు ఏటీఎంలలో ఏటీఎం కార్డును మార్చి నగదు చోరీ చేసిన ఘటన చోటుచేసుకుంది. పూడేరు గ్రామానికి చెందిన మహిళ తన ఏటీఎం కార్డు ద్వారా నగదు తీసుకునేందుకు ఏటీఎంలోకి వెళ్లింది. అదే సమయంలో అక్కడే ఉన్న మరో వ్యక్తి నగదు తీసి ఇస్తానంటూ ఆ మహిళ నుంచి ఏటీఎం కార్డు తీసుకొని తన చేతిలో ఉన్న మరో ఏటీఎం కార్డును ఆ మహిళకు ఇచ్చాడు. అక్కడ నుంచి ఆ వ్యక్తి ఉడాయించాడు. కొంత సమయం తరువాత ఆ మహిళ సెల్‌ఫోన్‌కు రూ.12వేల నగదు డ్రా అయినట్లు మెసేజ్ వచ్చింది. దీంతో ఆ మహిళ కంగారుపడి తమ దగ్గర ఉన్న ఏటీఎం కార్డు చూసుకోగా అప్పటికే మారిపోయి ఉన్నట్లు గుర్తించి లబోదిబోమంటూ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేసింది.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

విద్యాసామగ్రి అందజేత



మాట్లాడుతున్న చెంచురామయ్య

గూడూరుఅర్బన్, జూలై11:స్థానిక మాళవ్యానగర్‌లోని మున్సిపాల్ ప్రాథమిక పాఠశాలలో గురువారం గోపాల్‌రెడ్డి దాతృత్వంతో విద్యార్థులకు విద్యాసామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయమ్మ, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి బిల్లు చెంచురామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దాతృత్వంతో ఆర్థిక సాయం

గూడూరు అర్బన్, జూలై 11: స్థానిక 1వ వార్డులో గురువారం టీడీపీ కార్యకర్త వెంకటయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో అతడి అంత్యక్రియల నిమిత్తం ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ దాతృత్వంతో రూ. 3వేలు ఆర్థికసాయాన్ని వెంకటయ్య కుటుంబ సభ్యులకు టీడీపీ నాయకులు శివకుమార్, రాము అందజేశారు.

అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠకు విరాళాల సేకరణ



గూడూరు,జూలై11: స్థానిక సాయినగర్‌లో అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో స్వామి ఆలయ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈక్రమంలో భాగంగా అయ్యప్పస్వామి విగ్రహప్రతిష్ఠకు సంబంధించి భక్తులందరినీ భాగస్వాములను చేసేందుకు గురువారం ప్రజల నుంచి విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో గాధంశెట్టి గిరిబాబు, కోటి, సుబ్బారావు, శివయ్య, వినయ్‌కుమార్, మధు, శ్రీనివాసాచారి, సుబ్రమణ్యం, శ్రీహరి, కార్తీక్, నరసింహాలు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ సభ్యత్వ నమోదు

తడ, జూలై 11 : మండల యూటీఎఫ్ నూతన సభ్యత్వ కార్యక్రమం గురువారం జరిగింది. యూటీఎఫ్ జిల్లా మహిళా కార్యదర్శి సునీలా ఆధ్వర్యంలో జరిగిన ఈ సభ్యత్వ నమోదులో 98మంది ఉపాధ్యాయులను సభ్యులుగా చేర్చుకున్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బాబు, అధ్యక్ష కార్యదర్శులు నవీన్‌కుమార్, రాంబాబు, కార్యదర్శులు శ్రీనివాసులు, దుర్గాదేవి, రవికుమార్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడిన వారిని వెంటనే సస్పెండ్ చేయాలి

వెంకటగిరిటౌన్, జూలై 11: డక్కిలి మండలంలో పొదుపు సంఘాలలో అవినీతికి పాల్పడిన వారిని వెంటనే సస్పెండ్ చేయాలని ఏపీ ప్రజా సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు గద్దెల మునెయ్య అన్నారు. గురువారం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణకు వినతి పత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2016 ఏప్రిల్ నుంచి 2023 వరకు 27గ్రామాల్లో ఆర్థిక లావాదేవీలు క్షేత్రస్థాయిలో జరపాలని కోరారు.ఒక్కొక్క రూపాయి దాచుకుని పొదుపు సంఘాలు కట్టుకుంటుంటే వాటిలో కూడా అవినీతి జరిగిందని పేర్కొన్నారు. విచారణ నిర్వహించి వారిని నగదు రికవరీ చేసి, క్రిమినల్ కేసు నమోదు చేయాలని కోరారు. చేశారు.

యువకుడి ఆత్మహత్య



గూడూరు, జూలై 11: స్థానిక టిడ్కో గృహాల వద్ద ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం చోటుచేసుకుంది. రూరల్ పోలీసుల కథనం మేరకు.. కోట గ్రామానికి చెందిన సందీప్(34) మంగళవాయిద్యం వాయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. స్థానిక గాంధీనగర్ సమీపంలోని టిడ్కో గృహాల్లో నివాసముంటున్న సందీప్‌కు తెలిసినవారి ఇంటికి వచ్చాడు. ఇంట్లో ఎవరులేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న రూరల్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య ఉంది.

ఎర్రచందనం కేసులో డ్రైవర్ అరెస్ట్

తడ, జూలై 11 : ఎర్రచందనం రవాణాకేసులో డ్రైవర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. కడప జిల్లా ఒంటిమిట్ట నుంచి చెన్నైకు తరలిస్తున్న ఎర్రచందనాన్ని మంగళవారం రాత్రి పోలీసులు పట్టుకున్న విషయం తెలిసిందే. ఆ కేసులో ట్రక్ ఆటో డ్రైవర్ కత్తి వెంకటసుబ్బయ్యను అరెస్టు చేశామని ఎస్‌ఐ నరసింహరావు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి పార్తిపన్, కార్తీక్, కమల్‌నాథ్‌తోపాటు మరో వ్యక్తికి ఈ అక్రమ రవాణాకు సంబంధం ఉందని దర్యాప్తులో తేలిందని, వారి కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. పట్టుబడ్డ ఎర్రచందనం విలువ రూ.35.03 లక్షలు ఉంటుందని, దాంతోపాటు ట్రక్ ఆటో డ్రైవర్ వద్ద మరో 17,500 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నామని ఆయన చెప్పుకొచ్చారు.

గుండెపోటుతో టీడీపీ నాయకుడి మృతి

సూళ్లూరుపేట, జూలై 11:మండల పరిధిలోని కొమ్మినేని పల్లికి చెందిన టీడీపీ నాయకుడు పాకం నాగయ్య(47) గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ టీడీపీ నాయకులతో కలసి గురువారం ఆ గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఆమె మాట్లాడుతూ మృతుడి కుటుంబాన్ని పార్టీ పరంగా అన్ని విధాలా ఆదుకొంటామని ఎమ్మెల్యే తెలిపారు.

అక్రమ లే అవుట్లపై కమిషనర్ ఆరా

వెంకటగిరి, జూలై 11 : వెంకటగిరిలో అడ్డగోలుగా వెలిసిన వెంచర్లపై నిబంధనలకు గండి .. అక్రమార్జన దండి అన్న శీర్షికతో ఆంధ్రజ్యోతిలో గురువారం కథనం వెలువడటంతో మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ స్పందించారు. పట్టణ పరిధిలో అనుమతులు లేకుండా వెలిసిన లే అవుట్ల వివరాలు సేకరణలో నిమజ్ఞమయ్యారు. ఒకటి రెండు రోజుల్లో వాటిపై దాడులు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే అనుమతులు లేకుండా వున్న పలు లే అవుట్లను గర్తించామన్నారు.

అక్రమాలకు 'సింగిల్ విండో'!

- పలుచోట్ల రుణాల దుర్వినియోగం
- పోలింగ్‌కు ముందు ఐదు బ్రాంచుల్లో రూ.20 కోట్ల అందజేత
- ఉమ్మడి జిల్లాలో త్రిసభ్య కమిటీల ఇష్టారాజ్యం



ఎస్‌ఆర్‌పురంలోని 'విండో' కార్యాలయం

సహకార వ్యవస్థలో సంస్కరణలను తీసుకొచ్చాం. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు (సింగిల్ విండోలు) త్రీమెన్ కమిటీ వేశాం. అవన్నీ చక్కగా పని చేస్తున్నాయి.

- వైసీపీ ప్రభుత్వంలో తీసుకున్న ఈ చర్యలపై మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పిన మాట ఇది. కానీ, క్షేత్రస్థాయికి వచ్చేసరికి చాలావరకు ఆ త్రీమెన్ కమిటీలు సింగిల్ విండోలను అవినీతిమయంగా మార్చేశాయి.

- చిత్తూరు కలెక్టరేట్

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మంత్రి పెద్దిరెడ్డి సూచించిన వారితో 76 సింగిల్ విండోలకు త్రిసభ్య కమిటీలు వేశారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఈ కమిటీల పదవీకాలాన్ని ప్రభుత్వం పెంచుకుంటూ పోయింది. ఈ ఐదేళ్ల కాలంలో ఈ కమిటీలు ఇష్టారాజ్యంగా వ్యవహరించాయి.అదే సమయంలో తమ అక్రమాలు వెలుగు చూడకుండానూ మ్యానేజ్ చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో సిం గిల్ విండోల్లో జరిగిన అవినీతి లీలలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి.ఉమ్మడి జిల్లాలోని 76సింగిల్ విండోల్లో చాలావరకు అక్రమా ల పుట్టగా తయారయ్యాయి. ఆయా విండోల పాలకవర్గాలు, వాటి సీఈవో (సెక్రటరీ)లు కుమ్మక్కై దండుకున్నారన్న ఆరోపణలున్నాయి.

జేఎల్‌జీ రుణాలు పక్కదారి

జాయింట్ లయబులిటీ గ్రూపు (జేఎల్‌జీ) కింద ఐదు మంది ఉన్న బృందానికి ఒక్కొక్కరికి రూ.50 వేల వంతున మొత్తం రూ.2.50 లక్షల రుణం డీసీసీబీ ఇస్తుంది. ఇలా 2020-21, 2021-22 సంవత్సరాల్లో ఉమ్మడి జిల్లాలో 25కుపైగా విండోలు జేఎల్‌జీ రుణాలను ఇచ్చాయి. 2019-20 వరకు డీసీసీబీ ద్వారా జేఎల్‌జీ రుణాల పంపిణీ జరగ్గా.. అప్పటి మంత్రి పెద్దిరెడ్డి చెప్పారంటూ 2020-22 సంవత్సరాల్లో వైసీపీకి చెందిన చోటా నాయకులు, కార్యకర్తలకే రుణాలిచ్చారు. తీసుకున్న రుణాలను ఈ సొసైటీలు డీసీసీబీకి ఒక్కపైసా కూడా చెల్లించలేదు. రైతుల పేరిట ఇచ్చామంటూ విండోల త్రిసభ్య కమిటీ పాలకవర్గాలు రూ.కోట్ల రుణాలను పక్కదారి పట్టించాయి. విండోల వారీగా.. ప్రస్తుత చిత్తూరు జిల్లాలోని బైరెడ్డిపల్లెలో రూ.1.60 కోట్లు, పలమనేరులో రూ.25లక్షలు, కార్వేటినగరంలో రూ.10 లక్షలు, ఎస్‌ఆర్‌పురంలో రూ.20 లక్షలు, బయ్యప్పగారిపల్లె (పలమనేరు)లో రూ.50 లక్షలు, తిరుపతి జిల్లాలోని కాటూరు (శ్రీకాళహస్తి) రూ.10 లక్షలు, నారాయణవనం రూ.30 లక్షల మేరకు పక్కదారి పట్టాయి. అన్ని సింగిల్ విండోల్లోనూ విచారణ జరిపితే మరిన్ని అక్రమాలు వెలుగు చూస్తాయి.

డీసీసీబీలో దా'రుణాలు'పై అధికారుల సీరియస్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)లో నిబంధనలకు విరుద్ధంగా జరిగిన రుణాలు పంపిణీపై కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ పి. శ్రీనివాసులు సీరియస్ అయ్యారు. మరోవైపు దీనిపై విచారించి నివేదిక ఇవ్వాలని జిల్లా సహకారశాఖ అధికారి నాగవర్ధన ఆదేశించారు. బ్యాంకు అధికారులు, గత పాలకవర్గ సభ్యులు కలిసి అన్ని రకాల రుణాల మంజూర్లలో అవకతవకలకు పాల్పడటంపై 'డీసీసీబీలో దా'రుణాలు" శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం ప్రకంపనలు సృష్టించింది. ఈ వ్యవహారం గురించి తెలుసుకునేందుకు కలెక్టర్, జేసీల నుంచి అందిన ఆదేశాలతో శుక్రవారం బ్యాంకు సీఈవో మనోహర్‌గౌడ్ వారికి వివరణ ఇవ్వనున్నట్లు తెలిసింది. ఈ ఘటనకు సంబంధించి విచారించి పూర్తి వివరాలు అందజేయాలని చిత్తూరు డీఎల్‌సీవో వనజను జిల్లా సహకారశాఖ అధికారి ఆదేశించారు. ఇక, విజయవాడలోని నాబార్డు యంత్రాంగం సీరియస్ అయింది. పూర్తి వివరాలు ఇవ్వాలని నాబార్డు డీడీఎం సునీల్‌ను ఆదేశించింది.

పర్యవేక్షణ లేక..

రుణాలు పొందిన బృంద సభ్యులు తాము తీసుకున్న మొత్తాన్ని సింగిల్ విండోలకు చెల్లిస్తున్నారో లేదో పర్యవేక్షించేందుకు డీసీసీబీ సూపర్‌వైజర్లు ఉన్నారు. వారి నిర్లక్ష్యం కారణంగా విండోల్లో జమ అయిన జేఎల్‌జీ రుణాలు డీసీసీబీలకు చెల్లించకుండా స్వాహా చేశారు. అయితే వంద శాతం రికవరీ జరిగిందని ఓవర్ డ్యూస్ ఏమి లేదంటూ ఇటీవల ఆప్కాబ్, ఆర్‌బీఐలకు డీసీసీబీ పంపిన నివేదికలో పేర్కొంది. విండోల్లోని పుస్తకాలు, జప్తు చేసి సమగ్ర విచారణ చేస్తే స్వాహా చేసిన మొత్తాలు బయటపడతాయి.



పలమనేరులో అద్దె భవనంలో ఉన్న కార్యాలయం

సహకార సంఘాల అభివృద్ధి పేరుతో జిల్లాలో మూడు సింగిల్ విండోలు పెట్రోల్ బంకుల్ని నిర్వహిస్తున్నాయి. పర్యవేక్షణ లేక ఈ మూడు చోట్ల పెద్ద ఎత్తున నిధుల దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణలున్నాయి.

పెట్రోల్ బంకు నిర్వహణ పేరిట..

సహకార శాఖ అధికారులకు అన్నీ తెలిసినా పెద్దిరెడ్డి భయంతో వాటిని ఇన్నాళ్లు చూసీ చూడనట్లు వదిలేశారని సమాచారం. బయ్యప్పగారిపల్లె, రొంపిచెర్ల పెట్రోల్ బంకుల్లో రూ.20 లక్షలు చొప్పున, నగరి బంకులో రూ.25 లక్షల వరకు నిధుల దుర్వినియోగం జరిగినట్లు సమాచారం. ఈ విషయం తెలిసినా.. ఆ బంకులకు నోటీసులు ఇచ్చేందుకు కూడా సహకార శాఖ ధైర్యం చేయలేదు. పలు విండోలకు గోదాముల నిర్వహణ, మరమ్మతులు, షాపింగ్ కాంప్లెక్సు, ప్రహరీల నిర్మాణాల పేరుతో పెద్ద ఎత్తున నిధులు మంజూరయ్యాయి. అన్ని పనులు నాసిరకంగాజరగడంతో పాటు నిధుల గోల్‌మాల్ జరిగినట్లు పెద్ద ఎత్తున విమర్శలు వచ్చినా పట్టించుకున్న దిక్కు లేదు.

పోలింగ్‌కు ముందు రూ.20 కోట్ల రుణాలు

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల సమయంలో ఏప్రిల్, మే నెలల్లో పుంగనూరు, బైరెడ్డిపల్లె, పలమనేరు, వి.కోట, మదనపల్లె డీసీసీబీ బ్యాంకు బ్రాంచీల ద్వారా పంట రుణాల పేరిట రూ.20 కోట్లు మంజూరు చేశారు. అక్కడి రైతుల భూమిని మేనేజర్లు తనఖా పెట్టుకుని రుణాలు ఇవ్వాలి. అలా కాకుండా సిఫార్సుల మేరకు ఇష్టమొచ్చినట్లు రుణాలు మంజూరు చేసినట్లు తెలుస్తోంది. ఈ రుణాలన్నీ వైసీపీ శ్రేణులకే చేరినట్లు ఆరోపణలున్నాయి. ఇలా ఏయే బ్రాంచీల్లో ఎంత మేరకు పంట రుణాలను ఇచ్చారో బ్రాంచీల వారీగా లెక్కలు చూసి.. విచారిస్తే నిజాలు బయటపడతాయి. ఈ దిశగా ప్రస్తుత ప్రభుత్వం చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

చిత్తూరు జిల్లాకు రెండు కేంద్రీయ విద్యాలయాలు

చిత్తూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): బటన్లు నొక్కడమే అభివృద్ధిగా భావించిన వైసీపీ ప్రభుత్వానికి.. ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి మధ్య పాలనలో తేడా స్పష్టంగా కనిపిస్తోంది. గత ప్రభుత్వంలో జిల్లాకు కేంద్రీయ విద్యాలయం మంజూరైనా.. ఏర్పాటుకు చిత్తశుద్ధి చూపలేదు. ఇప్పటి ప్రభుత్వం రెండు కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటు దిశగా అడుగులేస్తోంది. వైసీపీ ప్రభుత్వంలో జిల్లాల విభజన జరిగినప్పుడే జిల్లా కేంద్రమైన చిత్తూరుకు కేంద్రీయ విద్యాలయ మంజూరైంది. చిత్తూరుతో పాటు అన్నమయ్య జిల్లాకూ మంజూరయ్యాయి. అక్కడ మరుసటి సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభమయ్యాయి. చిత్తూరులో మాత్రం సరైన భూమిని చూపించడంలో అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం, శ్రద్ధ లోపించింది. దీంతో విద్యాలయ ప్రారంభానికి నోచుకోలేదు. జిల్లా విభజన తర్వాత చిత్తూరులో చెప్పుకోదగ్గ స్థాయిలో ఒక్క విద్యా సంస్థ కూడా లేకుండా పోయింది. కేంద్రీయ విద్యాలయమైనా వచ్చిందనుకుంటే అప్పటి పాలకుల నిర్లక్ష్యంతో అదీ నెరవేరలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగా.. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ కేంద్రీయ విద్యాలయ సత్సంగ్ కమిషనర్‌కు లేఖ రాశారు. స్థలాన్ని పరిశీలించి వెంటనే ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని అందులో పేర్కొన్నారు. చిత్తూరులోని మంగసముద్రం ప్రాంతంలో.. సర్వే నెంబరు 167లో 8.08 ఎకరాల్ని కేంద్రీయ విద్యాలయ కోసం కేటాయించారు. వచ్చేవారం కేంద్రీయ విద్యాలయ సత్సంగ్ బృందం స్థల పరిశీలనకు రానుంది. ఇక, సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పంలోనూ మరో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. గురువారం అధికారులు స్థలాన్ని పరిశీలించారు. కుప్పానికి ఆరు కిలోమీటర్ల దూరంలోని కృష్ణదాస్‌పల్లెలో 10 ఎకరాల్ని కేటాయించినట్లు తెలుస్తోంది.

రంగునీళ్ల సమస్య పరిష్కారానికి కృషి

నగరి టీడీపీ నేతల ఆత్మీయ సమావేశంలో ఎంపీ దగ్గుమళ్ల ● ఇక కమీషన్ల వ్యవహారం ఉండదన్న ఎమ్మెల్యే భాను



టీడీపీ నాయకుల ఆత్మీయ సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీ ప్రసాదరావు

నగరి జూలై 11: నగరి నియోజకవర్గంలో టెక్స్‌టైల్స్‌పార్కు ఏర్పాటు, రంగునీళ్ల సమస్యపై జిల్లా అధికారులతో ప్రణాళికలను సిద్ధం చేసి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తామని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు తెలిపారు. నగరిలో గురువారం జరిగిన టీడీపీ ఆత్మీయ సమావేశంలో ఆయన ప్రసంగించారు. అసంపూర్తిగా ఉన్న టిడ్కో గృహాలకు అవసరమైన నిధులను మంజూరు చేయించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మీ ప్రాంతాలలో ఏ పని ముఖ్యమో గుర్తించి అంచనాలను వేయించి ఎమ్మెల్యే ద్వారా తన దృష్టికి తీసుకొస్తే మంజూరుచేయించేలా చర్యలు తీసుకుంటానన్నారు.శ్మశానాలకు సౌకర్యాలు లేక ఇబ్బంది పడటం, డ్రైనేజీ, తాగునీటి సమస్య తదితరాలను గుర్తిస్తే ఎంపీ లాడ్స్ ద్వారా పనులు చేయిద్దామన్నారు. గత ఐదేళ్లలో ఎంపీ లాడ్స్ ఎక్కడ ఖర్చుపెట్టారో తెలియడం లేదన్నారు. పరిశ్రమల స్థాపనకు ఎవరైనా ముందుకొస్తే సహకరిస్తామన్నారు. ఎన్నికల ముందు ఏమి చెప్పానో అదే మాటకు కట్టుబడి కష్టించి పనిచేసిన ప్రతి కార్యకర్త, నాయకుడిని ఆదుకుంటామని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చెప్పారు. ఏ చిన్న సమస్యనైనా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కమీషన్ల వ్యవహారం ఉండదని, ఏపని కావాలన్నా ఎవరికీ రూపాయి కూడా ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. సమావేశంలో మండలాల పార్టీ అధ్యక్షులు రమేష్‌బాబు, రమేష్‌రాజు, వెంకటేశ్వరచౌదరి, రవికుమార్, పార్లమెంటరీ అధికారప్రతినిధి చినబాబు, నాయకులు గంజి మాధవయ్య, సురేష్‌నాయుడు, రాష్ట్ర టీఎన్‌టీయూసీ కార్యదర్శి బాలాజి, జిల్లా అధికారప్రతినిధి జ్యోతినాయుడు, తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి మీరా, రాష్ట్ర ఎస్సీసెల్ అధికారప్రతినిధి దశరదవాసు, నేతలు అల్లిముత్తు, ఉమాపతిరాజు, ధనంజయ రాజు, కృష్ణారెడ్డి, లక్ష్మీప్రసన్న, హేమావతి తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లకు బ్రేక్

జిల్లావ్యాప్తంగా పనిచేయని సర్వర్లు

ఈసీఈలకు తప్పని తిప్పలు



రిజిస్ట్రేషన్ కోసం వేచివున్న ప్రజలు

చిత్తూరు కలెక్టరేట్, జూలై 11: చిత్తూరు జిల్లావ్యాప్తంగా గురువారం రిజిస్ట్రేషన్లకు బ్రేక్ పడింది. సర్వర్ పని చేయకపోవడంతో సుదూర ప్రాంతాల నుంచి రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వచ్చిన పలువురు సాయంత్రం వరకు పడిగాపులు కాచి, వెనుదిరగాల్సి వచ్చింది. జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ ఇదే పరిస్థితి కొనసాగింది. ఫలితంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒక్క రిజిస్ట్రేషన్ కూడా జరగలేదు. ఈసీ రాలేదు. విజయవాడలోని ప్రధాన కార్యాలయంలో సాంకేతిక కారణాలతో సమస్య ఏర్పడిందని అధికారులు ప్రకటించారు. గత ప్రభుత్వం దస్తావేజుల రిజిస్ట్రేషన్‌కు కార్డ్ ప్రైమ్ 2.0 సాఫ్ట్‌వేర్‌ను తీసుకొచ్చింది. దీంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియలో సమస్యలు ప్రారంభమయ్యాయి. ఈసీల జారీకి కూడా ఇదే సాఫ్ట్‌వేర్‌ను కొనసాగించడంతో సమస్య మరీ తీవ్రమైంది. గతంలో ఉన్న 1.0 ఫార్మెట్‌లో డాక్యుమెంట్ నెంబరు నమోదు చేయగానే ఈసీలు వచ్చేవి. 2.0 సాఫ్ట్‌వేర్‌కు మారిన తర్వాత ఈసీ పొందడం కష్టతరమైంది. సార్వత్రిక ఎన్నికల అనంతరం జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకుంది. భూములు, స్థలాలు, ఇళ్ల రిజిస్ట్రేషన్లు పెరుగుతున్నాయి. అయితే కార్యాలయాల్లో సక్రమంగా రిజిస్ట్రేషన్లు జరక్కపోవడంతో జిల్లాలోని స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయానికి రూ.కోట్లలో గండి పడుతోంది.


సమస్యను పరిష్కరిస్తున్నాం..

సర్వర్ సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేశాం. సాంకేతిక కారణాలతోనే జిల్లా అంతటా ఒక్క రిజిస్ట్రేషన్ కూడా జరక్కపోవడం నిజమే. శుక్రవారం నుంచి సర్వర్ పనిచేస్తుంది.

- శ్రీనివాసరావు, జిల్లా రిజిస్ట్రార్, చిత్తూరు

శ్రీకాళహస్తి
సత్యవేడు

ఆగమోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు



శ్రీకాళహస్తి, జూలై 11: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మేధో గురుదక్షిణామూర్తికి గురువారం ఆగమోక్తంగా పూజలు నిర్వహించారు. కలశ ప్రతిష్ఠ అనంతరం వినాయక పూజల కలశ పూజ వైదిక క్రతువులు నిర్వహించారు. స్వామివారికి వైభవంగా అభిషేకం నిర్వహించారు. సుగంధ పూలు, స్వర్ణాభరణాలతో అలంకరించిధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. మహామంగళ హారతులిచ్చారు. భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

నేటి నుంచి ధర్మరాజస్వామి ఉత్సవాలు



వేడుకలకు ముస్తాబవుతున్న ఆలయం

శ్రీకాళహస్తి, జూలై 11: పట్టణంలో ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా చెన్నైరోడ్డులో వెలసిన ఈ ఆలయంలో ఈనెల24 వరకు సాంప్రదాయబద్ధంగా ఉత్సవాలను నిర్వహించనున్నారు. శుక్రవారం ధ్వజారోహణంతో వేడుకలు ప్రారంభం కానున్నాయి. వారం రోజుల ముందు నుంచే ధర్మరాజస్వామి ఆలయ పరిసరాలను సుందరంగా ముస్తాబు చేశారు. గురువారం విద్యుత్ దీపాలంకరణతో అలంకరించారు.

15న సీపీఐ నియోజకవర్గ స్థాయి సమావేశం



మాట్లాడుతున్న గురవయ్య

శ్రీకాళహస్తి, జూలై 11: ఈనెల 15న పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి జనరల్‌బాడీ సమావేశం జరుగుతుందని సీపీఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య చెప్పారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు సాగు చేయడానికి భూమిలేక బ్బందులకు గురవుతున్నారన్నారు. పేదల సమస్యల పరిష్కారంలో అధికారులు విఫలమయ్యారన్నారు. మల్లికార్జున్, శివకుమార్, రాజయ్య, మణి, శివ, సుబ్రహ్మణ్యం,గాయత్రి పాల్గొన్నారు.

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే అమ్మకాలు



కందిపప్పును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, జూలై 11: ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే నిత్యావసర సరుకులను వినియోగదారులకు విక్రయించాలని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. అయ్యప్ప జనరల్ స్టోర్‌లో గురువారం ఆయన ప్రభుత్వ ధరల ప్రకారం వినియోగదారులకు సరకులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో నిత్యావసర ధరలు శరాఘాతంగా ఉండేవన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి నాదెండ్ల మనోహర్ చొరవతో ధరలు అందుబాటులో ఉండేలా నిర్ణయించారన్నారు. టీడీపీ నాయకులు మునిరాజా నాయుడు, విజయకుమార్ పాల్గొన్నారు.

ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి, జూలై 11: పట్టణంలోని ఆర్టీసీ డిపో ఆవరణంలో గురువారం ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దిన వేడుకలను నిర్వహించారు. గౌరవాధ్యక్షులు అంజూరు శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా హాజరై జెండాను ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి నాయకులు, కార్మికులకు పంచారు. యూనియన్ నాయకులు పీఎస్ కుమార్, జీపీఎస్ ఆచారి, రోశయ్యమురళి, రమేష్, ప్రసాద్, ఎంఎం రత్నం, కత్తి రవి పాల్గొన్నారు.

బయటి పదార్థాలను తినకూడదు



విద్యార్థులతో మాట్లాడుతున్న తహసీల్దారు, ఎంఈవో

కేవీబీపురం, జూలై 11: బయట పదార్థాలను తినకూడదని తహసీల్దారు శ్రీరాములునాయక్, ఎంఈవో రవికుమార్ కేజీబీవీ విద్యార్థులకు సూచించారు. అతిసార నియంత్రణ చర్యల్లో భాగంగా గురువారం వారు స్థానిక కేజీబీవీ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. వసతిగృహానికి నర్సును ప్రభుత్వం అందుబాటులో ఉంచిందన్నారు. ఆరోగ్యసమస్యలుంటే తెలియజేసి వెంటనే వైద్యం పొందాలన్నారు. హాస్టల్‌లోని వసతులు, తాగునీరు, మరుగుదొడ్లను సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ సుకన్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

45 వ్యవసాయ మోటర్ల స్టార్టర్ల చోరీ

శ్రీకాళహస్తి, జూలై 11: తొట్టంబేడు మండలం పొయ్య పంచాయతీ పరిధిలో 45 వ్యవసాయ విద్యుత్ మోటార్ల స్టార్టర్లను దొంగలు తీసుకుపోయారు. రైతులు గురువారం పొలానికి నీరు సరఫరా చేసేందుకు వెళ్లారు. కొందరు స్టార్టర్లు చోరీకి గురైనట్లు గుర్తించారు. తరువాత అందరూ మోటార్లను పరిశీలించారు. మొత్తం 45 స్టార్టర్లను దొంగలు దోచుకెళ్లినట్లు నిర్ధారించుకున్నారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి

శ్రీకాళహస్తి, జూలై 11: విద్యుదాఘాతంతో తుపాకుల పోలయ్య(50) అనే కూలీ మృతి చెందాడు. మిట్టకండ్రిగకు చెందిన పోలయ్య గురువారం సాయంత్రం ఇంట్లో ఫ్యాన్ బాగుచేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే అతడు మృతి చెందాడు. మృతునికి భార్య ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. వన్‌టౌన్ పోలీసులు కేసున మోదు చేశారు.చేస్తున్నారు.

ఆటో ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు



శ్రీకాళహస్తి, జూలై 11: ఆటో ఢీకొని లక్ష్మమ్మ(45) అనే మహిళ తీవ్రంగా గాయపడింది. కేవీబీపురం మండలం కొత్తూరుకు చెందిన లక్ష్మమ్మ సొంత పనుల నిమిత్తం గురువారం శ్రీకాళహస్తికి వచ్చింది. అనంతరం తిరిగి స్వగ్రామానికి వెళ్లేందుకు ఆటో స్టాండుకు చేరుకుంది. ఆటో ఆమెను ఢీకొంది. దీంతో గాయపడిన లక్ష్మమ్మను స్థానికులు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎడమకాలు విరగడంతో రుయాకు రెఫర్ చేశారు. రెండవ పట్టణ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ వసతి గృహాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు: సుధీర్

శ్రీకాళహస్తి, జూలై 11: ప్రభుత్వ వసతి గృహాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామనిఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం వసతిగృహాల అధికారులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీకాళహస్తిలో వసతిగృహాల నిర్వహణ విమర్శలు ఉన్నాయన్నారు. సమీకృత వసతిగృహంలో వసతుల కల్పనకు ఓ పరిశ్రమ నిర్వాహకులు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ ద్వారా ముందుకు వచ్చారన్నారు. హాస్టల్ వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఊరందూరులో ప్రకృతి వ్యవసాయం చేసే ఎస్సీ రైతులకు 200 లీటర్ల డ్రమ్ములు, టార్పాలిన్ పట్టలు అందజేశారు.

విద్యాసామగ్రి వితరణ



వరదయ్యపాళెం, జూలై 11: అమెరికాలో ఉంటున్న అంకెళ్ల చక్రవర్తి(విజయనగరం) పేద విద్యార్థుల కోసం రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్న సామాజిక సేవ అభినందనీయమని ఎంఈవో సరస్వతి అన్నారు. పాండూరు పంచాయతీ వెంగారెడ్డి కండ్రిగలో ఆయన సౌజన్యంతో గురువారం ప్రాథమిక పాఠశాలలో ఎంఈవో రూ.10వేలు విలువ చేసే విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శివ, ఉపాధ్యాయులు, బీజేపీ నాయకులు, మండల భవన నిర్మాణ కార్మికసంఘం నాయకులు పాల్గొన్నారు.

'ఉపాధి హామీ'కి సిబ్బంది కొరతతో ఇబ్బందులు



ఉపాధి కార్యాలయం

సత్యవేడు, జూలై 11: స్థానిక జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కార్యాలయాన్ని సిబ్బంది కొరత వేధిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వం నాలుగేళ్ళుగా కీలక పోస్టులను భర్తీ చేయలేదు. దీంతోఉన్న సిబ్బందిపై పని ఒత్తిడి పెరిగి నిర్వహణ గాడి తప్పుతున్నట్లు తెలుస్తోంది. మండలంలో 9,731 జాబ్ కార్డులున్నాయి. రోజుకు సగటున నాలుగు వేల మంది కూలీలు ఉపాధి పొందుతున్నారు. కూలీలకు సకాలంలో పనుల కల్పన, వేతనాల చెల్లింపు, మస్టర్లు, రికార్డుల నిర్వహణకు తగినంత సిబ్బంది లేరు. ఈసీ (ఇంజనీరింగ్ కన్సల్టెంట్), రెండు సీఓ (కంప్యూటర్ ఆపరేటర్) పోస్టులు ఉండాలి. ఈసీ లేక టెక్నికల్ అసిస్టెట్‌తోనే నెట్టుకొస్తున్నారు. పనుల అంచనాల తయారు, పరిపాలన అనుమతుల మంజూరు, పని ప్రదేశాల్లో జియో ట్యాగింగ్ తదితర పనుల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్ పాత్ర కీలకం. ఆ ఉద్యోగి లేక కూలీలకు సరైన న్యాయం జరగడం లేదని తెలుస్తోంది. ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్ల(సీఓ)కు గాను ఒక్కరే ఉన్నారు. మస్టర్లు, రికార్డులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం, కొత్త జాబ్‌కార్డులు మంజూరు చేయడం, కూలీల ఆధార్ సీడింగ్ తదితర ప్రక్రియల్లో ఆలస్యమవుతోంది. కొత్త ప్రభుత్వం వచ్చిన వెంటనే టీఏ (టెక్నికల్ అసిస్టెంట్) పోస్టు భర్తీ చేసింది. మిగిలిన పోస్టులు కూడా భర్తీ చేయాల్సిన అవసరం ఎంతయినా ఉంది.

గ్రామాల్లో మెరుగైన పారిశుధ్యానికి చర్యలు : డీపీఓ



మురుగు కాలువను పరిశీలిస్తున్న డీపీఓ సుశీలా దేవి

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 11: గ్రామాల్లోపారిశుధ్యం మెరుగుకు మండల స్థాయి, పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) సుశీలాదేవి ఆదేశించారు. స్టాప్ డయేరియాలో భాగంగా గురువారం కుక్కంబాకం పంచాయతీని పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించి అధ్వాన్నంగా ఉన్న మురుగు కాలువలను పరిశీలించి తక్షణం మురుగు కాలువలను శుభ్రం చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాలు కురుస్తున్నాయి కనుక గ్రామాలలో పారిశుధ్యం మేరకు తక్షణ చర్యలు తీసుకోవాలని సిబ్బందినిఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో త్రివిక్రమ్‌రావు, ఈవోపీర్డీ రాజశేఖర్, సచివాలయ సిబ్బంది, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జీవో 117 రద్దుకు ఎస్టీయూ డిమాండ్



జీవో కాపీ చూపిస్తున్న ఎస్టీయూ నాయకులు

కేవీబీపురం, జూలై 11: జీవో 117 రద్దు చేయాలని ఎస్టీయూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గురువారం ఆదర్శ పాఠశాల ఆవరణలో జరిగిన సంఘ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యాయ వాణి సంచాలకులు నాగేశ్వరరావు మాట్లాడారు. పాఠశాలల అభివృద్ధికి జీవో 117 విఘాతంగా మారిందన్నారు. అనంతరం ఎంఈవో లక్ష్మీపతికి నాయకులు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర అదర్శ పాఠశాలల అధ్యక్షులు మోహన్‌రెడ్డి, గురుప్రసాద్, జగన్నాథం, లక్ష్మయ్య, మురళి, చంద్రశేఖర్, కస్తూర్బా గాంధీ, పాఠశాల సిబ్బంది,తదితరులుపాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి గ్రామీణ విద్యార్థుల ఎంపిక

శ్రీకాళహస్తి, జూలై 11: తొండమనాడు ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కృష్ణయ్య గురువారం మాట్లాడుతూ పదోతరగతి మార్కుల ప్రతిభ ఆధారంగా విద్యార్థులు యోగేష్, అభిలాష్(నూజివీడు), దేవి(ఇడుపుపాయ), వి.అభిలాష్(శ్రీకాకుళం), మేఘన (ఒంగోలు) ఎంపికయ్యారన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్, ఎలక్ట్రానిక్స్ సబ్జెక్ట్‌లకు సంబంధించి ఒకేషనల్ టీచర్లను ప్రభుత్వంనియమించిందన్నారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు, తదితరులు అభినందించారు. **బుచ్చినాయుడుకండ్రిగ:** కల్లివెట్టు ఉన్నత పాఠశాలకు చెందిన నవ్య ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికయినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రూపేష్ కుమార్ తెలిపారు. పదవ తరగతి పరీక్షలో నవ్య 578 మార్కులు సాధించిందన్నారు. **పిచ్చాటూరు:** పిచ్చాటూరు జడ్పీ హైస్కూలుకు చెందిన పీ సోమశేఖర్ ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం గిరిప్రకాష్ తెలిపారు. సోమశేఖర్ పదో తరగతి ఫలితాల్లో మండలంలో ఫస్ట్ ర్యాంకరుగా నిలిచాడన్నారు. **ఏర్పేడు:** బండారుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు త్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. జనని నూజివీడు, లోకేశ్వరి,వెంకటమ్మలు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు నిర్మల్‌కుమార్ తెలిపారు.

సిద్ధ ఔషధ నేత్ర చికిత్సకు విశేష స్పందన

వరదయ్యపాళెం, జూలై 11: బత్తవల్లం ఏకం ఆలయ ప్రాంగణంలో గురువారం నిర్వహించిన కలిక్కం సిద్ధ ఔషధ నేత్ర చికిత్సకు విశేష స్పందన లభించింది. సుమారు 300 మంది వైద్య సేవలను పొందారు. ఈ సందర్భంగా లోకేష్ దాసాజీ మాట్లాడుతూ కలిక్కం సిద్ధ ఔషధం సిద్ధ వైద్యంలో కంటి వైద్యమన్నారు. అరుదైన మూలికల సారాలను కళ్లలో వేయడం వల్ల పలు వ్యాధులు నయమవుతాయన్నారు. సతీష్, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలల సందర్శన

రేణిగుంట, జూలై 11: మండల పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకుడు బాలకృష్ణ గురువారం సందర్శించారు. మండల పరిధిలోని ఆర్ అగ్రహారం, గుండ్రాలకాల్వ గ్రామాల్లో పాఠశాలలను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. అసిస్టెంట్ అకాడమిక్ మానటరింగ్ ఆఫీసర్ మధు, ఎంఈవోలు ఇంద్రాదేవి, రంగనాథయ్య పాల్గొన్నారు.

మోదుగులపాళెం అభివృద్ధికి కృషి
● మోహన్‌బాబు



పీర్ల ఉత్సవానికి మోహన్‌బాబును ఆహ్వానిస్తున్న మోదుగులపాళెం గ్రామస్తులు

ఏర్పేడు, జూలై 11:మోదుగులపాళెంలో పీర్లపండగకు సినీనటుడు మోహన్‌బాబును ఆ గ్రామస్తులు గురువారం ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వగ్రామంలో కులమతాలకు అతీతంగా పీర్లపండుగ నిర్వహించడం సంతోషకరమన్నారు. గ్రామ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. గ్రామస్తులు కలసికట్టుగా ఉండాలన్నారు. దయాకర్ మొదలియార్, శివకుమార్, కిరణ్‌కుమార్, చంద్రశేఖర్ చౌదరి, భరత్‌కుమార్, మంచుమస్తాన్ నాయుడు తదితరులు ఉన్నారు.

డ్యాన్సర్స్ అసోసియేషన్ సత్కారం

శ్రీకాళహస్తి, జూలై 11:శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బృందమ్మ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆమెకు టీడీపీ నాయకుడు సత్రవాడ ప్రవీణ్ గణపతి ప్రతిమను బహూకరించారు.తెలుగు రైతు ఉపాధ్యక్షుడు ప్రకాష్‌నాయుడు పాల్గొన్నారు. బృందమ్మను టీడీపీ సీనియర్ నాయకుడు బొల్లినేని జగన్నాథం నాయుడు ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు మహిళా నాయకురాలు రేణుకమ్మ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. శ్రీకాళహస్తీశ్వర డ్యాన్సర్స్ అసోసియేషన్ బృందమ్మను సత్కరించారు.రాష్ట్రపతి అవార్డు గ్రహీత ఆశ, అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్ పాల్గొన్నారు.సన్నిధి వీధిలో అంబలిస్వామి ఆశ్రమంలో టీడీపీ నాయకులు అన్నదానం చేశారు. వంకాయల సిద్ధులయ్య పాల్గొన్నారు.

బొజ్జల బృందమ్మకు పలువురి శుభాకాంక్షలు



శ్రీకాళహస్తి, జూలై 11:శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బృందమ్మ జన్మదినోత్సవాన్ని గురువారం టీడీపీ శ్రేణులు వేడుకగా జరిపాయి. ఉదయం నుంచే శ్రీకాళహస్తి మండలం ఊరందూరులోని ఆమె స్వగృహం వద్దకు టీడీపీ శ్రేణులు చేరుకుని శుభాకాంక్షలు తెలిపాయి.టీడీపీ పట్టణాధ్యక్షులు విజయకుమార్, తిరుపతి పార్లమెంటు కోశాధికారి కంఠా రమేష్ ఆధ్వర్యంలో బృందమ్మ కేక్ కట్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం చిత్తూరు జిల్లా మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి బొడుగు మునిరాజ యాదవ్ తదితరులు బృందమ్మను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేని కలిసి బీసీ వర్గాల సమస్యలపై విన్నవించారు. టీడీపీ నాయకులు మురగయ్య, సుబ్రహ్మణ్యం, రవినాయుడు, పేరం నాగరాజు నాయుడు తదితరులు పాల్గొన్నారు. విజ్ఞానగిరి ఆలయ కూడలి వద్ద పేదలకు అన్నదానం చేశారు. ఎమ్మెల్యే సతీమణి రిషితారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరైన కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాసరం రమేష్,డిల్లీబాబు, సుబ్బయ్య పాల్గొన్నారు. ఎన్టీఆర్ కూడలి వద్ద మైనార్టీ నాయకులు జావిద్,షాకీరాలీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. సాయంత్రం లక్కమనేని మధు ఆధ్వర్యంలో 71కేజీల కేక్‌ను బృందమ్మ కట్ చేశారు.

ధరల నియంత్రణే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే ఆదిమూలం



సరుకులు అందిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

సత్యవేడు, జూలై 11: నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణ కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే ఆదిమూలం పేర్కొన్నారు. గురువారం సత్యవేడులోని బీబీఎస్ రెసిడెన్సీ ఆవరణలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల ప్రత్యేక విక్రయ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజల కోసం ప్రభుత్వం నిత్యావసర సరుకుల ప్రత్యేక విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ఈ కేంద్రాలలో నాణ్యమైన కందిపప్పు కేజీ రూ.160, పచ్చిబియ్యం కేజీ రూ.48, స్టీమ్డ్ బియ్యం కేజీ రూ.49లకు అందిస్తుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామాంజనేయులు, డీటీ రవిచంద్రబాబు, మాజీ ఎంపీపీ మస్తాన్, మాజీ జడ్పీటీసీ సుందరరామిరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ రెడ్డి, ఎంపీటీసీ బీబీఎస్ రెడ్డి, నాయకులు పరమశివం, పీఎస్‌రాజు, అమాసరెడ్డి, శశి, లోకయ్యరెడ్డి పాల్గొన్నారు.

కంచనపల్లి ప్రభుత్వ భూముల్లోకి ప్రవేశిస్తే చర్యలు

శ్రీకాళహస్తి, జూలై 11: కంచనపల్లి ప్రభుత్వ భూముల్లోకి ప్రవేశిస్తే చర్యలు తప్పవని తొట్టంబేడు తహసీల్దారు హెచ్చరించారు. గురువారం కంచనపల్లి సర్వే నెంబరు 234/1లో 1.54ఎకరాల వాగు పోరంబోకు ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఎవరు ప్రవేశించినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. వీఆర్వో లహరి, తలారి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

వైభవంగా సాయిబాబా పాలాభిషేకం



పుత్తూరు, జూలై 11 : స్థానిక షిర్డి సాయిబాబా ఆలయంలో గురువారం పాలాభిషేకం వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్న హారతి నిర్వహించాక అన్నదానం చేశారు. సంధ్య హారతి, రాత్రి గంటలకు శేజ్ హారతితో కార్యక్రమాలు ముగిశాయి.

త్రిపుల్ ఐటీ సీట్లు సాధించిన విద్యార్థులు

వడమాలపేట, జూలై 11: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు త్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు కరుణా నవనీతం తెలిపారు. తరుణకు నూజివీడు, అంజేరప్ప, హేమలకు సీట్లు వచ్చాయన్నారు.

వైభవంగా పరాశరేశ్వరస్వామి రథోత్సవం



నారాయణవనం, జూలై 11: చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారితో సహా స్వామివారిని వేకువ జామున మేల్కొలిపి, నిత్యకైంకర్యాలు నిర్వహించారు. అనంతరం వేద మంత్రాల నడుమ ప్రత్యేక పుష్పాలతో, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం వివిధ రకాల పుష్పాలతో స్వామివారిన అలంకరించి రథంపై ఊరేగించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు నారికేలా, కర్పూర నీరాజనాలతో దర్శించుకున్నారు. ఆలయ సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయాధికారి నాగరాజు, ఆలయ సిబ్బంది, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆధునిక పరిజ్ఞానంతో అధిక దిగుబడి



డ్రోన్ కెమెరా పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

వడమాలపేట, జూలై 11: ఆధునిక సాంకేతిక పద్ధతుల ద్వారా వ్యవసాయ పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ రైతులకు సూచించారు. కదిరిమంగళం, పాదిరేడు గ్రామాల్లో గురువారం ఆయన పంటలను పరిశీలించారు. డ్రోన్ ద్వారా పురుగు మందుల పిచికారీ విధానాన్ని చూశారు. రైతులతో మాట్లాడారు. అధిక దిగుబడి సాధించే పరికరాలను ప్రభుత్వం సమకూర్చుతుందన్నారు. పీఎం కిసాన్ పథకం కింద ఫేషియల్ యాప్ ద్వారా రికార్డు చేసి కౌలు రైతులకు సాయం అందేలా చూడాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు, జిల్లా ఉద్యాన అధికారి దశరథరామిరెడ్డి, మైక్రో ఇరిగేషన్ అధికారి సతీష్, మండల వ్యవసాయాధికారి విజయ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.